



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు]

అమ్మబడును




కె. అబెడ్నేగో(రాజు బాబు ) : 9985998066
సిహెచ్. సురేష్ : 9959996243

RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 197 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ గురువారం 09 ఏప్రియల్ 2026 పేజీలు : 12 వెల : 2/-


## రోడ్ల కనెక్టివిటీతో
# ఎకనామిక్ యాక్టివిటీ



**పోర్టు కారిడార్ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు - జాతీయ రహదారుల నిర్మాణంతోనే జాతి నిర్మాణం**
**గోదావరి పుష్కరాల్లోపే రహదారుల నిర్మాణం... మరమ్మత్తులు - ఈవీ బస్సుల వినియోగం పెంచి రవాణా వ్యయం తగ్గేలా చర్యలు**
**రాష్ట్ర రహదారులు, జాతీయ రహదారుల ప్రాజెక్టులపై సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు**

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :**
రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చేలా జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్మాణం జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. జాతీయ రహదారులు రాష్ట్రంలోని పోర్టులతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలను కనెక్ట్ చేసేలా నిర్మాణం చేపట్టాలని సూచించారు. సచివాలయంలో బుధవారం రహదారులు భవనాలు, రవాణా, జాతీయ రహదారి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి సమీక్షించారు. రాష్ట్రంలో రోడ్ల నిర్వహణ, పాత్ హోల్ ఫ్రీ రహదారులు, ఈవీ బస్సుల వినియోగం, వివిధ రాష్ట్రాలను అనుసంధానించేలా జాతీయ రహదారి ప్రాజెక్టుల నిర్మాణంపై సమీక్షలో చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "రాష్ట్రంలో రహదారుల నిర్వహణ పటిష్టంగా ఉండాలి. మొత్తంగా 45,433 కిలోమీటర్ల మేర రోడ్లు ఉంటే... వాటిల్లో ఏటా 10,238 కిలోమీటర్ల మేర నిరంతర నిర్వహణ చేయాల్సి ఉంది. ప్రజలకు రోడ్ల వల్ల ఇబ్బంది లేకుండా చూడాలి. రోడ్ల నిర్వహణ అనేది నిరంతర ప్రక్రియగా చేపట్టాలి. ఎక్కడైనా రోడ్లకు గుంతలు పడితే... వాటినే వెంటనే సరిదిద్దితే ఇక ఇబ్బందులు ఉండవు. రోడ్ల నిర్వహణలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎలాంటి పద్ధతులను అవలంబిస్తున్నారనే అంశాన్ని అధ్యయనం చేయాలి. ఆర్ అండ్ బీ రహదారుల మెయింటెనెన్స్ కోసం నిధుల కొరత లేకుండా చూడాలి. వివిధ

మిగతా .. 2లో..



## భారతీయ వారసత్వ సంపదకు
# ఏయూ నిదర్శనం

### డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచవ్యాప్త గొప్ప వర్సిటీల్లో ఆంధ్రా యూనివర్సిటీ (ఏయూ) ప్రత్యేకమైనదని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. భారతీయ వారసత్వ సంపదకు ఏయూ నిదర్శనమని కొనియాడారు. ఆంధ్రా యూనివర్సిటీ

మిగతా .. 2లో..

# 'మావిగన్'పై జగన్ మళ్లీ సమర్థింపు..

### ఘాటుగా నారా లోకేష్ కౌంటర్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత నేపథ్యంలో 'మావిగన్' అంటూ చేసిన వ్యాఖ్యలను వైకాపా అధినేత వైఎస్ జగన్ మరోసారి సమర్థించుకున్నారు. తాడేపల్లిలో ఆ పార్టీ నేతలతో జరిగిన సమావేశంలో సీఎం చంద్రబాబుపైనా అనుచిత వ్యాఖ్యలు చేశారు. అయితే, జగన్ కామెంట్లపై ఏపీ మంత్రి నారా లోకేష్ వ్యంగ్యంగా స్పందించారు. తన

మిగతా .. 2లో..

## ఆదిలాబాద్‌లో అతిపెద్ద
# ఎయిర్‌పోర్టు నిర్మాణం

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశవ్యాప్తంగా ఎయిర్‌పోర్టుల ఏర్పాటుకు సంబంధించి వస్తోన్న అన్ని డిమాండ్లను పరిశీలిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను అశ్వినీ వైష్ణవ్, కిషన్ రెడ్డితో కలిసి రామ్మోహన్ నాయుడు సమావేశమయ్యారు. అనంతరం కిషన్‌రెడ్డితో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఫీజబులిటి ఉన్న చోట ఎయిర్‌పోర్టులు నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. "మామునూరు ఎయిర్‌పోర్టుకు మరో 3 నెలల్లో శంకుస్థాపన చేయాలని భావిస్తున్నాం. ఆదిలాబాద్, కొత్తగూడెం ఎయిర్‌పోర్టు ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తున్నాం. ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు అంశంపై ఇవాళ కూడా కీలక చర్చ

మిగతా .. 2లో..

## ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం అభివృద్ధికి
# రూ.170 కోట్లతో భారీ ప్రణాళిక

**మూడు దశల్లో స్టేడియం అభివృద్ధి, క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం**
**ఖేలో ఇండియా నిధులతో స్టేడియం అభివృద్ధి పనులకు శంకుస్థాపన**
**అమరావతి చట్టబద్ధత నేపథ్యంలో ఐజిఎంసి స్టేడియం అభివృద్ధికి శ్రీకారం**
**రాష్ట్ర రవాణా, క్రీడలు శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాబోయే మూడు సంవత్సరాలలో ప్రతి నగరం, పట్టణం, గ్రామాల్లో క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ క్రీడారంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలిపేలా కృషి చేస్తున్నామని రాష్ట్ర రవాణా, క్రీడలు శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం అభివృద్ధి పనులకు ఖేలో ఇండియా నిధులతో శంకుస్థాపన కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర రవాణా, క్రీడలు శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, క్రీడలు శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఉభయసభల్లో అమరావతికి చట్టబద్ధత కల్పించిన శుభ సందర్భంలో ఈ కార్యక్రమం జరగడం

మిగతా .. 2లో..

# సేంద్రియ వ్యవసాయమే భవిష్యత్

**రసాయనాల తగ్గింపు, ఆరోగ్యకరమైన భూమి, జీవన విధానం ముఖ్యం**
**డిమాండ్ ఆధారిత పంటల సాగుపై రైతులు ఆలోచనాత్మకంగా ముందుకు సాగాలి**
**మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల మార్పు అవసరం**
**సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది**
**మారుటేరు కిసాన్ మేళాలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



**పశ్చిమగోదావరి జిల్లా/మారుటేరు, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని స్థిరమైన అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఆచంట నియోజకవర్గంలోని, పెనుమంట్ర మండలం మారుటేరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో బుధవారం నిర్వహించిన "కిసాన్ మేళా" మారుతున్న వాతావరణ పరిస్థితులు – సుస్థిర వరి వ్యవసాయం" కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత పరిశోధన కేంద్రంలోని ల్యాబ్‌లను పరిశీలించి శాస్త్రవేత్తలతో మాట్లాడి ఆధునిక వరి వంగడాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ప్రైవేట్ కంపెనీలు ఏర్పాటు చేసని ప్రత్యేక

మిగతా .. 2లో..

## అమెరికా - ఇరాన్
# సీజ్ ఫైర్..

### స్పందించిన భారత్



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా–ఇరాన్ మధ్య కాల్పుల విరమణపై భారత్ స్పందించింది. ఈ సీజ్‌ఫైర్‌ను ఇరు దేశాలు అంగీకరించడాన్ని స్వాగతిస్తున్నట్లు పేర్కొంది. ఈ నిర్ణయంతో పశ్చిమాసియాలో శాంతి నెలకొంటుందని ఆశిస్తున్నట్లు విదేశాంగ శాఖ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. 'అమెరికా–ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకరించడాన్ని మేం స్వాగతిస్తున్నాం. ఇది పశ్చిమాసియాలో శాశ్వత శాంతికి దారితీస్తుందని ఆశిస్తున్నాం. ఉద్రిక్తతలను తగ్గించడం, నిరంతరం

మిగతా .. 2లో..

# పశ్చిమబెంగాల్ ఎన్నికలు

### మమత నామినేషన్ దాఖలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల హడావుడి నెలకొంది. ఈ క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన సొంత నియోజకవర్గం భవానీపుర్ నుంచి నామినేషన్ దాఖలు చేశారు. తన జీవితంలో అంతా ఇక్కడినుంచే మొదలైందని ఈ సందర్భంగా ఆమె వ్యాఖ్యానించారు. నామినేషన్ వేయడానికి ముందు కాళీఘాట్‌లోని నివాసం నుంచి అలీపుర్ సర్వే భవనం వరకు ఆమె రోడ్‌షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మద్దతుదారులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం ఆమె ఇక్కడ

మిగతా .. 2లో..

## పోలింగ్‌కు ముందే..
# టీవీకేకు ఎదురు దెబ్బ



**చెన్నై, విశ్వం వాయిస్ న్యూస్ :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న వేళ.. సినీ నటుడు విజయ్ పార్టీ టీవీకేకు తొలి షాక్ తగిలింది. పోటీ చేయకుండానే ఒక స్థానాన్ని కోల్పోవాల్సి వచ్చింది. ఆ పార్టీ అభ్యర్థి దాఖలు చేసిన నామినేషన్ తిరస్కరణకు గురి కావడమే దీనికి కారణం. ఎడప్పాడి శాసనసభ స్థానానికి ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్‌కు ప్రపోజర్ల సంతకాలు సరిపోలేదు. దీంతో ఆయన నామినేషన్ తిరస్కరణకు గురైంది. ఈ నియోజకవర్గం నుంచి విజయ్ పార్టీ తరపున బరిలోకి దిగిన అరుణ్ కుమార్ నామినేషన్‌ను అధికారులు

మిగతా .. 2లో..

## ఇరాన్ ప్రాధేయపడింది..
# ట్రంప్ దయ చూపారు


### అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్‌పై 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' విజయవంతమైందని అమెరికా రక్షణమంత్రి పీట్ హెగ్సెత్ ప్రకటించారు. తమకు ఎదురయ్యే దుర్భర పరిస్థితి కన్నా ఒప్పందమే మేలని ఆ దేశ కొత్త ప్రభుత్వం గ్రహించిందని అన్నారు. వారికి వేరే మార్గాలు, సమయం లేకపోవడంతో కాల్పుల విరమణకు ప్రాధేయపడిందన్నారు. నిమిషాల్లో ఆ దేశాన్ని కుప్పకూల్చే శక్తి ఉన్నా.. ట్రంప్ దయ చూపించారని పేర్కొన్నారు. అమెరికా షరతులకు ఇరాన్ ఒప్పుకోకపోతే తీవ్రదాడులు జరిగేవన్నారు. వరుస దాడులతో అమెరికా దళాలు

మిగతా .. 2లో..


## కాల్పుల విరమణ..
# భారత్‌లో ఇంధన ధరలు తగ్గుతాయా?



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియాలో నెలరోజులకు పైగా కొనసాగుతోన్న ఉద్రిక్తతలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. అమెరికా–ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందంతో చమురు రవాణాకు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధి తిరిగి తెరుచుకోనుంది. దీంతో ఇటీవల భగ్గుమన్న చమురు ధరలు.. నేటి కాల్పుల విరమణ ప్రకటన తర్వాత అమాంతం దిగొచ్చాయి. మరి ఈ పరిణామాలతో భారత్‌లోనూ ఇంధన ధరలు

మిగతా .. 2లో..

## ఇరాన్‌కు ఆయుధాలిచ్చే దేశాలపై
# 50శాతం టారిఫ్‌లు : ట్రంప్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్‌తో కాల్పుల విరమణ అనంతరం ట్రంప్ తాజాగా మరోసారి హెచ్చరికలు చేశారు. టెహ్రాన్‌కు ఆయుధాలు సరఫరా చేసే దేశాలపై 50శాతం సుంకాలు విధిస్తానని ప్రకటించారు. ఇరాన్‌కు ఆయుధాలిస్తూ తమ దేశానికి ఉత్పత్తులు ఎగుమతి చేసే దేశాలకు ఈ టారిఫ్‌లు వర్తిస్తాయన్నారు. ఇందులో ఎలాంటి మినహాయింపులు లేవంటూ ట్రూత్‌లో పోస్ట్ పెట్టారు. ఇరాన్‌లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను ట్రంప్ ప్రయోజనకరమైన

మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## రోడ్ల కనెక్టివిటీతో ఎకనామిక్ యాక్టివిటీ

ప్రాంతాల్లో భౌగోళిక పరిస్థితులను అధ్యయనం చేసి దాని ఆధారంగా రహదారుల నిర్మాణం జరగాలి. రహదారి నిర్వహణకు ప్రామాణికతను నిర్దేశించాలి. స్థానికంగా భౌగోళిక పరిస్థితులు, వాతావరణం అంశాలను పరిగణనలోకి తీసుకుని రోడ్ల నిర్వహణలో చర్యలు చేపట్టాలి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, బ్లాక్ కాటన్ సాయిల్ ఉన్న చోట హైబ్రీడ్ మోడల్ లో బీటీ లేదా వైట్ ట్యాప్ రోడ్ల నిర్మాణం చేపడితే బాగుంటుంది. కాలువలు ఉన్న 570 కిలోమీటర్ల మేర రహదారులు పదే పదే ధ్వంసం అవుతున్నాయి. ఇలాంటి ప్రాంతాల్లో ఏ మెటీరియల్‌తో రోడ్ల నిర్మాణం జరిగితే బాగుంటుందనేది ఆలోచన చేయాలి. దీనిపై యూనివర్శిటీల్లో అధ్యయనం చేయిస్తే కొత్త ఆవిష్కరణలు వస్తాయి. గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో రోడ్ల మరమ్మతులు చేపట్టండి. గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో మొత్తంగా 471 గ్రామాల్లో రోడ్లను మరమ్మత్తులు చేపట్టాలి. గ్రేటర్ రాజమహేంద్రవరం పరిధిలో చేపట్టే రోడ్ల అభివృద్ధి అనేది అన్ని ప్రాంతాలకు రోల్ మోడల్‌గా నిలిచేలా పనులు చేపట్టాలి. పుష్కరాలకు ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో రూ.400 కోట్లతో 531 కిలోమీటర్ల పొడవైన రహదారులను అభివృద్ధి చేయాలి. దీని కోసం సాస్కీ నిధులను వినియోగించుకోవాలి. కుంభమేళా తరహాలో పుష్కరాలకు నిధులు ఇవ్వాలని కోరుతూ కేంద్రానికి లేఖ రాయాలని' అని సీఎం సూచించారు.

### పోర్టుల అనుసంధానానికి ప్రాధాన్యత

"రాష్ట్రంలోని పోర్టులను కనెక్ట్ చేసేలా జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టాలి. ఆర్థిక లావాదేవీలకు కేంద్రంగా పోర్టులు ఉన్నాయి. పోర్టులను కనెక్ట్ చేసేలా పశ్చిమ భారతంలో గుజరాత్ మోడల్ అలానే ఉంది. తూర్పు భారతంలో తీర ప్రాంతం, పోర్టుల విషయంలో ఏపీ కీలకంగా ఉంది. ఈస్ట్-వెస్ట్ కారిడార్ గా జాతీయ రహదారుల నిర్మాణం జరగాలి. ఈ రకమైన కనెక్టివిటీని పెంచడం ద్వారా లాజిస్టిక్స్ వ్యయం గణనీయంగా తగ్గించటమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలి. లాజిస్టిక్స్ రంగాన్ని రాష్ట్రంలో అభివృద్ధి చేసేలా పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టాలి. దీని నిమిత్తం ఏపీ లింక్ ద్వారా ఆర్థిక వనరుల్ని సమకూరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. మౌలిక సదుపాయాల ద్వారా సామాన్యుడికి సౌకర్యాలు పెరగాలి, ఇదే సమయంలో ఆర్థిక లావాదేవీలు జరగాలి. ప్రభుత్వం ప్రజాధనాన్ని అభివృద్ధి కోసం ఖర్చు చేస్తోంది. ప్రతి పైసా సద్వినియోగం కావాలి. అత్యుత్తమ ఫలితాలు రావాలి. ప్రస్తుతం 73 శాతం కార్గో రోడ్ రవాణ ద్వారానే వెళ్తోంది. రైల్వే ద్వారా వెళ్లే కార్గో వ్యయం తక్కువగా ఉన్నట్టే రహదారుల కార్గో వ్యయం కూడా తగ్గాల్సిన అవసరం ఉంది. మూలపేట, విశాఖ, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, రామాయపట్నం, కృష్ణపట్నం పోర్టుల మధ్యనున్న ప్రాంతాలను అనుసంధానిస్తూ జాతీయ రహదారుల నిర్మాణం జరగాలి. ఆయా పోర్టులను అనుసంధానం చేసే సమయంలో ఆయా పోర్టులకు సమీపంలోని పొరుగు రాష్ట్రాల సరిహద్దులను కలుపుకుని వెళ్లేలా ప్రధాన రహదారులు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలు ఉండాలి. రహదారుల నిర్మాణం వల్ల ఎకనామిక్ యాక్టివిటీ పెరగాలి. జాతీయ రహదారులకు సమీపంలో ఉండే ప్రాంతాల అభివృద్ధి జరగాలి. జాతీయ రహదారులతో పాటు దేశ నిర్మాణం జరగాలి. ఏపీ పారిశ్రామిక, ఉద్యాన ఉత్పత్తుల కేంద్రంగా మారుతోంది. జాతీయ అంతర్జాతీయ మార్కెట్లకు కనెక్టు చేసేలా రహదారులు రావాలి. వివిధ నగరాలకు రింగ్ రోడ్లు వస్తే ఆయా ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు విస్తృతం అవుతాయి. పొరుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రధాన నగరాలను ఏపీని కనెక్టు చేసేలా రహదారుల నిర్మాణం జరగాలి. ఖరగ్ పూర్-అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవే, హైదరాబాద్-శ్రీశైలం డోర్నాల హైవే, కల్వకుర్తి-నంద్యాల హైవే వంటి జాతీయ రహదారుల నిర్మాణం జరిగితే కనెక్టివిటీ మరింత పెరుగుతుంది. వివిధ కారిడార్ల ద్వారా 1335 కిలోమీటర్ల జాతీయ రహదారుల రెండేళ్లలో అందుబాటులోకి వస్తాయి. ఈ ఏడాదిలో రూ.24,502 కోట్ల విలువైన ప్రాజెక్టులు పూర్తి కావాలి. రాజమండ్రి, కాకినాడ, తిరుపతి, కర్నూలు, నెల్లూరు ప్రాంతాల్లో అవుటర్ కారిడార్ మోడల్స్ ను అధ్యయనం చేయాలి." అని ముఖ్యమంత్రి నిర్దేశించారు.

### ఈవీలతో తక్కువ రవాణా వ్యయం

"అతి తక్కువ వ్యయంతో ప్రజా రవాణా అందుబాటులోకి రావాలి. దీనికి ఈవీ బస్సుల వినియోగం సరైన మార్గం. క్లీన్ ఫ్యూయెల్ వినియోగం ఎక్కువ జరిగితే ఖర్చు తగ్గుతుంది. ఫలితాలు ప్రజలకు అందుతాయి. సోలార్ పవర్ ను సమర్థంగా నిర్వహించడం ద్వారా విద్యుత్ కొనుగోలు ధరను సుమారు రూ.1 మేర తగ్గించ గలిగాం. కాస్ట్ ఆప్టిమైజేషన్ ఆఫ్ ఫ్యూయల్ విధానంపై దృష్టి సారిస్తే తక్కువ ఖర్చు.. ఎక్కువ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. ఈవీ బస్సులకు కిలోమీటరుకు రూ.72 వ్యయం అవుతోంది. వివిధ మోడళ్లను అధ్యయనం చేసి అతి తక్కువ వ్యయంతో ఈవీలను ఆపరేట్ చేయాలి. ఛార్జింగ్ స్టేషన్లు, బ్యాటరీ స్టాండర్డైజేషన్ లాంటి అంశాలను పరిశీలించాలి. అన్నీ కేటగిరీల్లోనూ ఏసీ ఈవీ బస్సులే ఉండాలి. ఈ సైకిళ్ల వినియోగం మరింతగా పెంచేలా ప్రమోట్ చేయాలి. ఈ-సైకిళ్లు మాస్ ట్రాన్ పోర్టుగా మారేంతగా ప్రజలకు అవగాహన కల్పించాలని" సీఎం స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశానికి మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆర్టీసీ ఎండీ బాలసుబ్రహ్మణ్యం, జాతీయ రహదారుల సంస్థ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఏయూ నిదర్శనం

శతాబ్ది ఉత్సవాలకు ముఖ్యఅతి థిగా పవన్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు భవిష్యత్తును శాసిస్తారని.. ఏయూలో చదివిన వారు దేశ ప్రగతికి పునాదులు వేశారని చెప్పారు. ఓటమికి సిద్ధపడి రాజకీయాల్లోకి వచ్చానని పవన్‌కల్యాణ్ చెప్పారు. భావితరాల కోసం బాధ్యతగా పనిచేయాలని కోరుకున్నట్లు చెప్పారు.

## 'మావిగన్'పై జగన్ మళ్లీ సమర్థింపు..

సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. జగన్ చెప్పే మావిగన్‌లో మా అంటే మాయ, వి అంటే విధ్వంసం, గన్ అంటే గందరగోళం/గన్ కల్చర్ అంటూ లోకేశ్ మండిపడ్డారు. 'మావిగన్' అంటే ఇదేనా అంటూ కామెంట్ చేశారు. దానికి **#MavigunMavayya**, **#HistoricAmaravatiResolution** హ్యాష్‌ట్యాగ్‌లను జోడించారు.

### జగన్ ఏమన్నారంటే?

"సీఎం చంద్రబాబు చర్యలతో చివరకు రాష్ట్రానికి రాజధాని లేకుండా పోతుంది. అధికారంలోకి వచ్చాక ఏబీఎన్ అధినేతను కోర్టుల చుట్టూ తిప్పుతాం. పాదయాత్ర ప్రారంభమయ్యాక వైకాపా శ్రేణులు సీఎం చంద్రబాబుకు సినిమా చూపిస్తారు" అని వైఎస్ జగన్ వ్యాఖ్యానించారు.

## ఎయిర్‌పోర్టు నిర్మాణం

జరిగింది. ఆదిలాబాద్‌లో అతిపెద్ద ఎయిర్‌పోర్టు నిర్మించాలని కేంద్రం భావిస్తోంది. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖకు 300 ఎకరాల భూమి కూడా ఉంది. సివిల్ ఏవియేషన్‌తో కలిసి జాయింట్ వెంచర్‌కు సిద్ధంగా ఉన్నామని రక్షణ శాఖ చెప్పింది. సైన్యానికి శిక్షణతోపాటు సివిల్ ఏవియేషన్ అవసరాల కోసం వాడాలని రక్షణ శాఖ మంత్రి చెప్పారు. ఈ నెల 17న క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లాలని అధికారులు నిర్ణయించారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం 450 ఎకరాలు ఇవ్వాల్సి ఉంటుంది. భూసేకరణకు ఎలాంటి ఇబ్బంది లేదని ఆదిలాబాద్ జిల్లా నేతలు చెప్తున్నారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు కావాల్సిన అన్ని అనుకూలతలు ఆదిలాబాద్‌కు ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా అంతర్గాం వద్ద ఎయిర్‌పోర్టు ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం పంపించింది" అని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.

## అమెరికా - ఇరాన్ సీజ్ ఫైర్

సంప్రదింపులు జరపడం, దౌత్యం ద్వారానే ఈ సంఘర్షణకు ముగింపు లభిస్తుందని మేము ఇంతకుముందే స్పష్టంచేశాం. ఈ యుద్ధం వల్ల ఇప్పటికే ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. ప్రపంచ ఇంధన సరఫరా, వాణిజ్య నెట్‌వర్క్‌లకు అంతరాయం కలిగింది. తాజా ఒప్పందం నేపథ్యంలో హర్మూజ్ జలసంధి మీదుగా నౌకల రవాణాకు ఏ ఆటంకం ఉండదని ఆశిస్తున్నాం' అని విదేశాంగ శాఖ పేర్కొంది. దాదాపు 40 రోజులుగా అమెరికా- ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య భీకర పోరు కొనసాగింది. దీనికి అడ్డుకట్ట వేస్తూ.. కాల్పుల విరమణకు అంగీకరించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. హర్మూజ్‌ను తిరిగి తెరిచేందుకు, ఈ కాల్పుల విరమణకు ఇరాన్ కూడా అంగీకారం తెలిపింది.

### ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం అభివృద్ధికి

## రూ.170 కోట్లతో భారీ ప్రణాళిక

విశేషమన్నారు. విజయవాడ నగరానికి ఎంతో భావోద్వేగ అనుబంధం కలిగిన ఐజీఎమ్ఎస్ స్టేడియం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. స్టేడియం అభివృద్ధికి మొత్తం సుమారు రూ. 160 నుండి రూ. 170 కోట్ల వరకు మూడు దశల్లో వ్యయం చేయనున్నట్లు తెలిపారు. ఇందులో ఖేలో ఇండియా ద్వారా రూ.20 కోట్లు, శాప్ ద్వారా రూ. 20 కోట్లు, మిగిలిన నిధులు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సమకూరనున్నాయని వెల్లడించారు. గత ప్రభుత్వ ఐదేళ్లలో ఆగిపోయిన క్రీడా అభివృద్ధి కార్యక్రమాలు ఇప్పుడు వేగం పుంజుకున్నాయని, గుంటూరులో ఇప్పటికే శంకుస్థాపన జరిగిందని, త్వరలో శ్రీకాకుళంలో కూడా పనులు ప్రారంభమవుతాయని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రానికి కేంద్రం నుండి రూ.1000 కోట్ల నిధుల ప్రతిపాదనలు ఉన్నాయని, రెండో విడతలో రూ.100 కోట్లకు పైగా నిధులు వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రంలో క్రీడారంగం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని మంత్రి కొనియాడారు. రాబోయే మూడు సంవత్సరాలలో ప్రతి గ్రామం, పట్టణం, నగరంలో క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ ఆంధ్రప్రదేశ్‌ను క్రీడా రంగంలో అగ్రగామిగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఆప్రా) మ్యాచ్‌లను అమరావతిలో ప్రారంభించి కడపలో ముగించాలనే ప్రతిపాదనను స్వాగతిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి హామీ ఇచ్చారు. పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ విజయవాడ వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమని, అమరావతి రాజధానిగా శాశ్వత గుర్తింపు రావడంతో నగరానికి మరింత అభివృద్ధి అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ నగరాల్లో క్రీడా వసతులు మెరుగుపడుతున్నాయని తెలిపారు. స్టేడియాన్ని సుమారు రూ.185 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. అమరావతిలో 2500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ, అలాగే స్పోర్ట్స్ యూనివర్సిటీ స్థాపనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 2029 నాటికి విజయవాడ, అమరావతిలో నేషనల్ గేమ్స్ నిర్వహించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పార్లమెంటు సభ్యులు చెప్పారు. శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు మాట్లాడుతూ స్టేడియం అభివృద్ధిలో ఎంపీ కేశినేని శివనాథ్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. స్టేడియం అభివృద్ధి కోసం పలుమార్లు సందర్శించి మార్గనిర్దేశం చేశారని చెప్పారు. ఎంపీ సూచనల మేరకు స్టేడియంలో ఒక బ్లాక్‌కు ప్రముఖ మహిళా క్రీడాకారిణి పేరు పెట్టనున్నట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది నాటికి స్టేడియం పూర్తిగా రూపురేఖలు మారిపోతాయని, అంతర్జాతీయ స్థాయి క్రీడా కార్యక్రమాలను నిర్వహించేలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, శాసనసభ్యులు గద్దే రామ్మోహన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ.లక్ష్మీశ, నగర పాలక సంస్థ కమిషనర్ హెచ్ ఎం. ధ్యానచంద్ర,, శాప్ వీసీ అండ్ ఎండీ ఎస్. భరణి, అంతర్జాతీయ చెస్ క్రీడాకారిణి కోనేరు హంపి, మార్కోలైన్స్ పేవ్‌మెంట్స్ టెక్నాలజీస్ లిమిటెడ్ డైరెక్టర్ వెల్లంకి రేవంత్, తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయమే భవిష్యత్

స్టాల్స్‌ని పరిశీలించి, వ్యవసాయ రంగంలో ఉపయోగించే ఆధునిక యంత్రాలను స్వయంగా డ్రైవ్ చేశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి సభలో మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం ద్వారా రైతులకు తక్కువ వ్యయంతో ఎక్కువ లాభాలు సాధ్యమవుతాయని, అదే సమయంలో భూమి సారాన్ని కాపాడుతూ ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించవచ్చని ఆయన తెలిపారు. ప్రస్తుతం రసాయన ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం వల్ల భూమి నాణ్యత దెబ్బతింటోందని, రైతుల ఖర్చులు పెరుగుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని మార్చడానికి సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం అత్యవసరమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సేంద్రియ వ్యవసాయం వైపు మారేందుకు శిక్షణ, సబ్సిడీలు, మార్కెటింగ్ సదుపాయాలు అందిస్తున్నదని ఆయన వివరించారు. రైతులు ఉత్పత్తి చేసిన సేంద్రియ పంటలకు మంచి ధర లభించేలా ప్రత్యేక మార్కెట్లు ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణం అందించాలంటే సేంద్రియ వ్యవసాయాన్ని ప్రతి రైతు ఆచరించాల్సిన అవసరం ఉందని మంత్రి పిలుపునిచ్చారు. రైతుల సంక్షేమం, ప్రజల ఆరోగ్యం దృష్ట్యా సేంద్రియ వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రోత్సహించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో అభివృద్ధి చేసిన వరి వంగడాలు దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో సాగు చేసి అధిక దిగుబడులు సాధిస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలను అభినందించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల ఆహారపు అలవాట్లు మారుతున్నందున మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటల సాగు చేయాలని రైతులకు సూచించారు. ఏ ప్రాంతంలో ఏ పంటలు అనుకూలమో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు గ్రామ స్థాయిలోనే రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని, ప్రభుత్వం ట్రాక్టర్లు, డ్రోన్లు, ఇతర వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై అందిస్తున్నందున వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాలువల ఆధునీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, సాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టును రాబోయే పుష్కరాల కంటే ముందుగానే పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజ్యసభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ రైతులకు ప్రధానమంత్రి సన్మాన్ నిధి పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. రైతులు భూసార పరీక్షలపై తప్పకుండా అవగాహన కలిగి ఉండాలన్నారు. సేంద్రియ ఉత్పత్తులు సాగు చేయడానికి ఆలోచన చేయాలన్నారు. దేశీయ వినియోగాల్ని పెంచాలని సూచించారు. రాష్ట్రంలో నదులు అనుసంధానం ద్వారా సాగునీటి కొరత లేకుండా సాధ్యపడుతుందన్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం అభివృద్ధి చేసిన వరి వంగడాలు దేశవ్యాప్తంగా విశేష గుర్తింపు పొందాయని తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి 24 గంటల్లోపే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. రబీ పంట కొనుగోలుకు 7.25 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించామని వెల్లడించారు. సభాధ్యక్షులు ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం స్థాపించి 100 సంవత్సరాలు పూర్తయ్యాయని, ఈ సందర్భంగా కిసాన్ మేళా నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. ఈ కేంద్రం ద్వారా 70 - 75 రకాల నూతన వరి వంగడాలు అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. తణుకు ఎమ్మెల్యే ఆరుమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ యాంత్రికరణలో భాగంగా నూతన పరికరాలను సబ్సిడీపై అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విద్యాలయం వైస్ ఛాన్సలర్ డా.ఆర్ శారదా జయలక్ష్మి దేవి, హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ధనుంజయరావు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, రిటైర్డ్ సీనియర్ సైంటిస్ట్ ఆలపాటి సత్యనారాయణ, మారుటేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ సహాయ సంచాలకులు టి.శ్రీనివాస్, కోనసీమ, ఏలూరు, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ చైర్మన్ సామంతపూడి శ్రీరామరాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి. పిచ్చయ్య, పెనుమంత్ర తహసిల్దార్ వై.రవికుమార్, మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ విభాగ అధికారులు, సిబ్బంది, వ్యవసాయ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమబెంగాల్ ఎన్నికలు

నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఆ తర్వాత విలేకరులతో మాట్లాడుతూ.. 'నేను పుట్టింది, పెరిగింది భవానీపుర్‌లోనే. నా జీవితంలో అంతా ఇక్కడినుంచే మొదలైంది' అని వ్యాఖ్యానించారు. మొత్తం 294 స్థానాల్లోనూ టీఎంసీ అభ్యర్థులను గెలిపించాలని ఈ సందర్భంగా ఆమె ప్రజలను కోరారు. ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)లో భాగంగా.. పలువురి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడంపై మమత ఆందోళన వ్యక్తంచేశారు. 'ఓటర్ల జాబితా నుంచి అనేకమంది పేర్లను తొలగించడం నాకు చాలా బాధ కలిగిస్తోంది. ఓటరు తుది జాబితా ఇంకా ఎందుకు విడుదల చేయలేదో నాకు అర్థంకావడం లేదు. దీనికి వ్యతిరేకంగా మేం మళ్లీ కోర్టును ఆశ్రయిస్తాం' అని అన్నారు. భవానీపుర్ నుంచి మమత మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. దీదీకి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గం నుంచి భాజపా తన అభ్యర్థిగా సువేందు అధికారిని బరిలోకి దింపింది. ఇక, బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23, 29న రెండు విడతలుగా జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు ఉండనుంది.

### పోలింగ్‌కు ముందే..

## టీవీకేకు ఎదురు దెబ్బ

పరిశీలించారు. అయితే, నామినేషన్ పత్రాల్లో పేర్కొన్న ప్రపోజర్ల వివరాలు ధ్రువీకరించలేకపోవడంతో రిటర్నింగ్ అధికారి ఆ దరఖాస్తును తిరస్కరించారు. ప్రధాన అభ్యర్థితో పాటు ఆ పార్టీ వేసిన ప్రత్యామ్నాయ అభ్యర్థి నామినేషన్ కూడా ఇదే కారణంతో తిరస్కరణకు గురి కావడం గమనార్హం. మాజీ సీఎం, ఏఐఏడీఎంకే కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి వరుసగా ఆరోసారి విజయం సాధించేందుకు సిద్ధమయ్యారు. అధికార పార్టీ డీఎంకే నుంచి సి కాశీ బరిలోకి దిగారు. వీరిద్దరి నామినేషన్లు ఆమోదం పొందాయి. ఈ నెల 23న తమిళనాడు ఎన్నికలు జరగనున్నాయి.

### ఇరాన్ ప్రాధేయపడింది..

## ట్రంప్ దయ చూపారు

ఇరాన్ సైన్యాన్ని నామరూపాల్లేకుండా చేశాయన్నారు. ఆ దేశం వద్ద ఉన్న క్షిపణుల నిల్వలను ధ్వంసం చేశామని.. ఇకపై క్షిపణులు, రాకెట్లు, డ్రోన్లు వంటి ఏ ఆయుధాలు తయారు చేయలేదని పేర్కొన్నారు. 47 ఏళ్లుగా తమకు ఇరాన్‌తో ఉన్న ముప్పు ఇప్పుడు తొలగిపోయిందని అన్నారు. వైట్‌హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హెగ్సెత్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. మంగళవారం రాత్రి అమెరికా దళాలు ఇరాన్‌లోని 800 లక్ష్యాలపై దాడులు చేశాయని హెగ్సెత్ పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఆ దేశ రక్షణ, అణు పారిశ్రామిక స్థావరాలు, ఫ్యాక్టరీలు ధ్వంసమయ్యాయన్నారు. ఇజ్రాయెల్‌తో సంయుక్తంగా చేపట్టిన దాడుల్లో ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ గాయపడ్డారని హెగ్సెత్ వెల్లడించారు. అమెరికా జాయింట్ చీఫ్స్ ఛైర్మన్ డాన్ కెయిన్ మాట్లాడుతూ.. ఇరాన్‌లో అమెరికా సైనిక లక్ష్యాలు నెరవేరాయని అన్నారు. కాల్పుల విరమణ కేవలం తాత్కాలిక విరామం మాత్రమేనని.. అవసరమైతే పోరాటాన్ని పునఃప్రారంభించడానికి తమ దళాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు.

### కాల్పుల విరమణ..

## భారత్‌లో ఇంధన ధరలు తగ్గుతాయా?

తగ్గుతాయా? అంటే కాదనే సమాధానమే వినిపిస్తోంది. యుద్ధం సమయంలో హర్మూజ్‌ను ఇరాన్ మూసివేయడంతో చమురు సరఫరాకు ఆటంకం ఏర్పడింది. దీంతో క్రూడాయిల్ ధర వేగంగా పెరిగింది. ఈ ప్రభావం దేశీయంగానూ కొంతమేర కన్పించింది. చమురు కొరత ఏర్పడితే.. ఇంధన ధరలు పెరుగుతాయనే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ భయాలను తగ్గించడానికే కేంద్రం ఇటీవల ఇంధన దిగుమతులపై ఎక్సైజ్ డ్యూటీని భారీగా తగ్గించింది. ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు కాల్పుల విరమణ ప్రకటించగానే అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు దాదాపు 13-14 శాతం వరకు పడిపోయాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 95 డాలర్లకు దిగొచ్చింది. దీంతో దేశీయంగానూ చమురు ధరలు తగ్గుతాయనే భావన వ్యక్తమవుతోంది.

### భారత్‌పై ప్రభావం ఉంటుందా?

ప్రపంచవ్యాప్తంగా హర్మూజ్ జలసంధి నుంచి 20 శాతం చమురు రవాణా జరుగుతుంది. ఈ మార్గంలోనే గల్ఫ్ దేశాల నుంచి చమురు, గ్యాస్ నౌకలు భారత్‌కు చేరుకుంటాయి. ఇప్పటివవరకు ఆందోళనల నేపథ్యంలో ఈ రవాణాకు అంతరాయం ఏర్పడింది. ఇప్పుడు కాల్పుల విరమణతో నౌకల ప్రయాణం మొదలైతే దేశీయంగా ఇంధన కొరత భయాలు తగ్గినట్లే. కానీ, ఆ ప్రభావం రిటైల్ మార్కెట్లో కన్పించకపోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఉద్రిక్తతల నేపథ్యంలో ఇప్పటికే కొన్ని కంపెనీలు ముందుగానే చమురు కొనుగోలు చేసి నిల్వ ఉంచాయి. ఇప్పుడు అంతర్జాతీయంగా వీటి ధరలు తగ్గినా.. కంపెనీలు వాటిని రిటైల్ మార్కెట్లోకి బదిలీ చేసే అవకాశం తక్కువే. అయితే, సమీప భవిష్యత్తులో సామాన్య కస్టమర్లపై ధరల భారం పడకుండా ఈ కాల్పుల విరమణతో ఉపశమనం లభించనుంది. అయితే, చమురు ధరలు తగ్గితే పలు రంగాల్లో నిర్వహణ వ్యయాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. రవాణా ఖర్చులు తగ్గడం వల్ల ఆహార ద్రవ్యోల్బణం దిగిరావొచ్చు. సీజ్‌ఫైర్‌తో సానుకూల ప్రకటన రాగానే మార్కెట్‌లో అస్థిరత్వం తగ్గింది.

### మరింతకాలం గందరగోళమే..

హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచినా.. చమురు సరఫరా ఇంతకు ముందులా జరగాలంటే ఇంకాస్త సమయం పడుతుంది. బీమా, రవాణా ఖర్చులు అధికంగా ఉండటం వల్ల నౌకలు ఈ మార్గంలో ప్రయాణించేందుకు సంకోచిస్తాయి. ఈ కాల్పుల విరమణ తాత్కాలికమే కాబట్టి.. మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకునే భయాలూ వెంటాడుతాయి. 'సీజ్‌ఫైర్' ఇలాగే కొనసాగి, హర్మూజ్ జలసంధి మీదుగా చమురు రవాణా మునుపటి స్థాయికి చేరుకునే దాన్ని బట్టి.. దేశీయంగా ఇంధన ధరలు ఆధారపడి ఉంటాయని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

### ఇరాన్‌కు ఆయుధాలిచ్చే దేశాలపై

## 50శాతం టారిఫ్‌లు : ట్రంప్

పాలనాపరమైన మార్పుగా అభివర్ణించారు. భవిష్యత్తులో ఆ దేశంతో కలిసి పనిచేస్తామన్నారు. భూగర్భ అణు కేంద్రాలపై బి-2 బాంబర్లతో చేసిన దాడుల వల్ల ఏర్పడిన అణు వ్యర్థాలను టెహ్రాన్ సహాయంతో పూర్తిగా వెలికితీసి తొలగిస్తామన్నారు. దాడులు జరిగిన నాటి నుంచి ఆ ప్రాంతంలో దేనినీ కదిలించలేదని.. అమెరికా 'స్పేస్ ఫోర్స్' ఉపగ్రహాల ద్వారా నిరంతరం ఆ ప్రదేశంపై నిఘా ఉంచామని తెలిపారు. ఇరాన్‌లో ఇకపై ఎలాంటి యురేనియం శుద్ధి కార్యక్రమాలు జరగబోవని తేల్చిచెప్పారు. సుంకాలు, ఆంక్షల నుంచి ఉపశమనం కల్పించే అంశంపై ప్రస్తుతం ఆ దేశంతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. కాల్పుల విరమణ ప్రతిపాదనలోని అనేక అంశాలపై ఇప్పటికే ఇరుదేశాల మధ్య ఏకాభిప్రాయం కుదిరిందన్నారు.

# ఎడిటర్ వాయిస్

## జనసేన బీజేపీ సీట్ల షేర్ పెరుగుతుందా?

బూత్ లెవెల్ నుంచి పునాది బలంగా ఉన్న పార్టీ టీడీపీ. అంతే కాదు నాలుగున్నర దశాబ్దాలుగా తిరుగులేని శక్తిగా టీడీపీ క్షేత్ర స్థాయిలో పాతుకుని పోయింది. ఏపీలో మూడు పార్టీలు కూటమిలో ఉన్నాయి. అందులో అతి పెద్ద పార్టీ టీడీపీ. బూత్ లెవెల్ నుంచి పునాది బలంగా ఉన్న పార్టీ టీడీపీ. అంతే కాదు నాలుగున్నర దశాబ్దాలుగా తిరుగులేని శక్తిగా టీడీపీ క్షేత్ర స్థాయిలో పాతుకుని పోయింది. ప్రస్తుతం ఉన్న 175 అసెంబ్లీ సీట్లలో అన్ని చోట్లా టీడీపీకి బలమైన పటిష్టమైన యంత్రాంగం పార్టీకి ఉంది. ఇక జనసేన తన బలాన్ని మెల్లగా విస్తరించుకుంటోంది. బీజేపీ అయితే పొత్తు పార్టీగా ఉంటూ తన బలాన్ని పెంచుకోవాలని చూస్తోంది.

మహత్తర అవకాశంగా : అయితే కూటమి పార్టీలకు మహత్తర అవకాశంగా అసెంబ్లీ సీట్ల పెంపు ఉండబోతోంది అని అంటున్నారు. 2029 లో చూస్తే కనుక ఇపుడు ఉన్న 175 సీట్లు కాస్తా 263 సీట్లుగా పెరుగుతాయని అంటున్నారు. దాంతో మూడు పార్టీలకు మంచి రోజులే వచ్చినట్లు అని విశ్లేషిస్తున్నారు. 2024 ఎన్నికల్లో పొత్తుల కోసం ఎన్నో సర్దుబాట్లు దిద్దుబాట్లు చేసుకుని ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వకుండా కలసికట్టుగా పని చేయడం వల్ల విజయం సాధ్యమైంది అయితే 2029 నాటికి ఆ పరిస్థితులు ఉండకపోవచ్చు అని అంటున్నారు. మూడు పార్టీలలో ఆశావహులు త్యాగరాజులు కోటి ఆశలు పెట్టుకుని కూర్చున్నారు. సరిగ్గా అలాంటి వారి కోసమే ఈ అదనపు సీట్లు ఉంటాయని అంటున్నారు.

సీట్ల పంపకాల మీదనే : దీంతో పెరిగే సీట్ల మీద మూడు పార్టీలలో అందరి దృష్టి ఉంది. జనసేనలో అయితే ఈసారి ఏకంగా డెబ్బై సీట్ల దాకా పోటీ చేస్తామని అంటున్న నాయకులు ఉన్నారు. బీజేపీ అయితే తన బలాన్ని ఏకంగా 30 సీట్ల దాకా పెంచుకోవాలని చూస్తోంది. టీడీపీ పెద్ద పార్టీగా తన సీట్లను కనీసంగా 200 ప్లస్ గా చేసుకోవాలని ఆరాటపడుతోంది. మరి ఈ లెక్కన చూస్తే పెరిగే 263 సీట్లు సరిపోతాయా అన్నది మరో చర్చ. అయితే కూటమి పార్టీలు జాగ్రత్తగానే ఈ సీట్ల పంపకాలను పూర్తి చేసుకుంటాయని అంటున్నారు. దానికి 2024 లో వచ్చిన ఓట్లు అపుడు ఇచ్చిన సీట్ల రేషియో అన్నది ఒక ప్రాతిపదికగా ఉండవచ్చు అని ప్రచారం సాగుతోంది.

అదే జరిగితే కనుక : ఇక 175 సీట్లకు జనసేన 21 సీట్లలో పోటీ చేసి అన్ని సీట్లు గెలిచింది. బీజేపీకి 10 సీట్లు ఇస్తే ఎనిమిది గెలిచింది. మరి 2029లో ఈ సీట్లు పెరుగుతాయా అంటే కచితంగా పెరుగుతాయి. అయితే అవి ఒక రేషియోలోనే పంపిణీ చేసుకోవచ్చు అన్న చర్చ సాగుతోంది. జనసేనకు ఆ విధంగా చూస్తే 21 సీట్లకు రెట్టింపు లభించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. అంటే 42 నుంది 45 దాకా అలాగే బీజేపీకి 20 దాకా సీట్లు దక్కే చాన్స్ ఉండొచ్చు అని అంటున్నారు. ఆయా పార్టీలకు ఓట్ల షేర్ వాస్తవ బలాల అధారంగానే ఈ పంపిణీ జరగవచ్చు అని అంటున్నారు. అపుడు టీడీపీ 200 ప్లస్ సీట్లకు పోటీ చేయడానికి వీలు అవుతుందని అంటున్నారు.

ప్రత్యర్థులకు నో చాన్స్ : కూటమి పార్టీలు కలసికట్టుగానే 2029 ఎన్నికల్లో పోటీకి దిగాలని నిర్ణయించుకున్నాయి. ప్రత్యర్థి వైసీపీకి ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా చూడాలని పట్టుదలగా ఉన్నాయి. అందువల్ల బలమున్న చోట తమకు పట్టున్న చోట సీట్లు తీసుకుని పోటీ చేయడం మిగిలిన చోట్ల కూటమి పార్టీలకు మద్దతు ఇవ్వడం అన్న ప్రాతిపదికగా ఈ మొత్తం వ్యవహారం ఉంటుంది అని అంటున్నారు. దాని వల్ల 2024 లో వచ్చినట్లుగా సెంట్ పర్సెంట్ స్ట్రైక్ రేటు సాధించే వీలు ఉంటుందని అదే సమయంలో అందరూ విజేతలుగా ఉంటారని భావిస్తున్నారు. మొత్తం మీద చూస్తే అదనపు సీట్ల వల్ల అన్ని పార్టీలకు మంచి అవకాశాలే లభిస్తాయని అంటున్నారు. చూడాలి మరి ఈ ప్రచారం బట్టి ఏమి జరుగుతుందో.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు బీటెక్ విద్యార్థుల మృతి



హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : సాగర్ రోడ్డు హస్తినాపురం వద్ద బుధవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మద్యం మత్తులో కారు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ఓ వ్యక్తి.. ద్విచక్ర వాహనాన్ని, నడిచి వెళ్తున్న మరో యువకుడిని ఢీకొట్టాడు. వంద మీటర్ల వరకు ఈడ్చుకెళ్లి కారు పల్టీ కొట్టింది. ఘటనలో ద్విచక్రవాహంపై వెళున్న మహావీర్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు శివ, సందీప్ మృతి చెందారు. రోడ్డుపై నడిచివెళ్తున్న మరో యువకుడు కూడా మృతి చెందాడు. దీంతో కారు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కళాశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. డ్రైవర్‌ను తమకు అప్పగించాలని విద్యార్థులు నినాదాలు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వ్యాపారికి బేడీలు వేసి.. ఆభరణాల దుకాణంలో దోపిడీ



కాశీబుగ్గ, విశ్వం వాయిస్ న్యూస్ : ఆభరణాల దుకాణంలోకి వచ్చిన వ్యక్తులు వ్యాపారికి బేడీలు వేసి కిలో బంగారంతో ఉడాయించారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితుడు, పోలీసుల వివరాల ప్రకారం.. 'పోలీసు' అని రాసి ఉన్న టీ షర్టులు, మాస్కులు ధరించిన 8 మంది మధ్యాహ్నం స్థానిక నిత్యానందనగర్‌లోని శ్రీవెంకటేశ్వర జ్యువెలర్స్‌లోకి ప్రవేశించారు. తుపాకీ చూపించి దుకాణ యజమాని కిల్లంశెట్టి రామకృష్ణారావును బెదిరించారు. ఆయన చేతులకు బేడీలు వేశారు. లాకర్ తాళం చెవులు తీసుకొని, అందులోని బంగారు ఆభరణాలతోపాటు వ్యాపారి మెడలో ఉన్న ఆభరణాలూ తీసుకొని పారిపోయారు. దుండగులు వెళ్లాక.. బాధితుడు బేడీలతోనే బయటికి వచ్చి సమీప దుకాణదారులకు దోపిడీ గురించి చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకొని బేడీల లింకు కట్ చేయించారు. కిలో బంగారు ఆభరణాలు పోయినట్లు బాధితుడు తెలిపారు.

## శంషాబాద్ విమానాశ్రయంలో.. రూ.14 కోట్ల విలువైన గంజాయి పట్టివేత

శంషాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : బ్యాంకాక్ నుంచి అక్రమంగా తరలిస్తున్న 14 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న ఘటన శంషాబాద్ విమానాశ్రయంలో మంగళవారం జరిగింది. ఎయిర్‌పోర్ట్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన మోసిన్ బహదూర్ వ్యక్తిగత పనుల కోసం బ్యాంకాక్ వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రూ.14 కోట్ల విలువైన గంజాయిని తన సామగ్రిలో రహస్యంగా పెట్టుకొని థాయ్ ఎయిర్ ఎయిర్‌లైన్స్ టీజీ-329 విమానంలో ఎక్కి శంషాబాద్‌లో దిగాడు. బయటికి వెళ్తుండగా అతడి ప్రవర్తనపై భద్రతాధికారులకు అనుమానం రావడంతో అదుపులోకి తీసుకొని తనిఖీ చేశారు. గంజాయి అక్రమ రవాణా గుట్టురట్టయింది. ప్రయాణికుడిని అరెస్టు చేశారు.

## గొలుసు దొంగలకు సంకెళ్లు

### సినీఫక్కీలో పట్టుకున్న వికారాబాద్ పోలీసులు



తాండూరు, విశ్వం వాయిస్ న్యూస్ : మహిళ మెడలోంచి బంగారు గొలుసును దొంగిలించి పారిపోతున్న నలుగురిని.. సాంకేతికత సాయంతో వెంబడించి పట్టుకున్నారు వికారాబాద్ జిల్లా పోలీసులు. తాండూరు పట్టణ సీఐ పరమేశ్వర్, యాలాల ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరుకు చెందిన ఆర్టీసీ కండక్టర్ దొరల లక్ష్మి ఉదయం విధులకు హాజరయ్యేందుకు వెళ్తుండగా.. వెనక నుంచి వచ్చిన దుండగులు ఆమె మెడలోని పుస్తెలతాడును తెంపేందుకు ప్రయత్నించారు. లక్ష్మి ప్రతిఘటించి గట్టిగా అరవడంతో పారిపోయారు. అక్కడి నుంచి యాలాల మండలం కోకట్ పరిధిలోని తాండూరు పట్టణ శివారు పైవంతెన ప్రాంతానికి చేరుకొని ఇంటి ముందు వాకిలి ఊడుస్తున్న మండల్ శ్యామమ్మపై దాడిచేసి పుస్తెల తాడు గుంజుకొని పరారయ్యారు. తాండూరు బస్టాండు చేరుకొని హైదరాబాద్ బస్సెక్కారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే అప్రమత్తమైన యాలాల పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలించారు. నిందితులు ఎక్కిన బస్సు వివరాలు నిర్ధారించుకొని కండక్టర్ ఆర్.రాము, డ్రైవర్ కరీంల సెల్‌ఫోన్లకు అనుమానితుల చిత్రాలు పంపారు. వారి సూచనతో బస్సు మొయినాబాద్ సమీపానికి చేరుకోగానే అనుసరించిన యాలాల పోలీసులు స్థానిక పోలీసులతో కలిసి బస్సులోకి ఎక్కి తనిఖీలు చేశారు. గమనించిన నిందితులు.. సొత్తును పక్కన పడేసి బుకాయించడానికి ప్రయత్నించారు. అయితే ఆధారాలు చూపించిన పోలీసులు... నిందితులను అదుపులోకి తీసుకున్నారు. దొంగతనం చేసిన వారిని హైదరాబాద్‌లోని బహదూర్‌పురా పరిధి హసన్‌నగర్‌కు చెందిన ఎండీ మోసిన్ (26), చాంద్రాయణగుట్టకు చెందిన సయ్యద్ సొహైల్ (23), కె.కృష్ణ(19), చిన్న ఎర్రవల్లితండా రాజాపూర్‌కు చెందిన గౌతమ్(19)గా గుర్తించారు.

## కుమార్తెతో కలిసి సాగర్ కాల్వలోకి దూకి తల్లి ఆత్మహత్య

మాచర్ల, విశ్వం వాయిస్ న్యూస్ : పల్నాడు జిల్లా మాచర్ల మండలం తాళ్లపల్లిలో విషాద ఘటన చోటుచేసుకుంది. కుమార్తెతో కలిసి నాగార్జున సాగర్ కుడి కాలువలోకి దూకి ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. సమీపంలో ఉన్న వ్యవసాయ కూలీలు వెంటనే గమనించి అక్కడికి చేరుకున్నారు. పోలీసులకు సమాచారమందించారు. విజయపురి సౌత్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వారిని రక్షించే ప్రయత్నం చేసినా.. ఫలితం లేకుండా పోయింది. మృతదేహాలను వెలికి తీసి మాచర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిద్దరూ స్థానికులు కాదని.. ఎక్కడి నుంచో ఇక్కడికి వచ్చి ఆత్మహత్య చేసుకున్నారని పోలీసులు అనుమానిస్తున్నారు.

## హైదరాబాద్‌లో పైలట్ శిక్షణా విద్యార్థినిపై అత్యాచారం

హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. పైలట్ శిక్షణా సంస్థ విద్యార్థినిపై అదే సంస్థ ఉద్యోగి అత్యాచారం చేశాడు. నిందితుడిని కేరళకు చెందిన నసీముద్దీన్‌గా గుర్తించారు. ఫొటోలు, వీడియోలు తీసి బెదిరించి పలుసార్లు అత్యాచారం చేశాడని బాధితురాలు ఫిర్యాదు చేసింది. 2025 జనవరి నుంచి పలు సార్లు అత్యాచారం చేశాడని తెలిపింది. దీంతో పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## వివాహితను నమ్మించి వంచించిన కేడీలు

### రెండు కిలోల బంగారు ఆభరణాలు, రూ.26 లక్షలతో పరారీ

బెంగళూరు (యశ్వంతపుర), విశ్వం వాయిస్ న్యూస్ : భర్తకు, పిల్లలకు దూరంగా ఉంటూ ఒంటరిగా ఉంటున్న ఓ సంపన్న మహిళను ఇద్దరు వ్యక్తులు నిలువునా ముంచేశారు. ఆమెనుంచి విడతల వారీగా బంగారం, డబ్బు తీసుకుని ఉడాయించారు. బెంగళూరులో జరిగిన ఈ ఘటనకు సంబంధించి నగర పోలీస్ కమిషనర్ సీమంత్‌కుమార్ సింగ్ తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరుకు చెందిన ఓ వివాహిత(38)కు సామాజిక మాధ్యమాల ద్వారా తెలంగాణలోని చెన్నూరుకు చెందిన మహేశ్ అలియాస్ పృథ్వీరెడ్డి(34), ఏపీలోని అనంతపురం నివాసి వి.స్వామి (38) అనే వ్యక్తులు పరిచయమయ్యారు. ఆమె భర్త బిల్డర్ కాగా వారికి ఇద్దరు పిల్లలు. ఏడాది న్నరగా కుటుంబానికి ఆమె దూరంగా, ఒంటరిగా జీవిస్తుండటంతో దానిని అలుసుగా తీసుకుని నిందితులు స్నేహం పెంచుకున్నారు. ఏవో అవసరాల కోసమంటూ రెండు కిలోల బంగారు నగలు, రూ.26 లక్షల నగదును విడతల వారీగా తీసుకున్నారు. నెల క్రితం కనిపించకుండా మాయమయ్యారు. దుండగుల మోసాన్ని ఆలస్యంగా గుర్తించిన బాధితురాలు.. పోలీసులను ఆశ్రయించడంతో నిందితులను పట్టుకున్నామని కమిషనర్ వెల్లడించారు. కొంత బంగారాన్ని, సొమ్మును వారు ఇప్పటికే వాడేశారని, 571 గ్రాముల బంగారు నగలనే స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## పదోతరగతి విద్యార్థులకు తప్పిన ప్రమాదం..

### ఖమ్మం జిల్లాలో పాఠశాల బస్సును ఢీకొన్న లారీ



ఏదులాపురం, విశ్వం వాయిస్ న్యూస్ : పదోతరగతి పరీక్షలు రాసి.. సంతోషంగా వసతిగృహానికి తిరిగి వెళ్తున్న విద్యార్థుల బస్సును మంగళవారం ఓ లారీ ఢీకొట్టింది. దాంతో ఒక్కసారిగా హాహాకారాలు, రోదనలు మిన్నంటాయి. అదృష్టవశాత్తు పిల్లలు స్వల్ప గాయాలతో బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఖమ్మం జిల్లా ఏదులాపురం పరిధిలోని నాయుడుపేట వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం గ్రామీణ మండలం ఆరెంపుల పరిధిలోని మహ్మదీయ ఇంజినీరింగ్ కళాశాలలో ముస్లిం మైనార్టీ గురుకుల పాఠశాలను నిర్వహిస్తున్నారు. ఇందులోని 30మంది విద్యార్థులు నాయుడుపేట సమీపంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఎస్సెస్సీ పరీక్షలు రాసి, వెనక్కి వచ్చేందుకు ఇద్దరు ఎస్కార్ట్ ఉపాధ్యాయులతో కలిసి బస్సు ఎక్కారు. ఇందిరమ్మ కాలనీ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా ఖమ్మం బైపాస్ నుంచి వేగంగా వచ్చిన ఓ లారీ బస్సును బలంగా ఢీకొట్టింది. దీంతో విద్యార్థులంతా ఒక్కసారిగా కుదుపునకు గురై, చెల్లాచెదురుగా పడిపోయారు. సీట్ల ముందున్న ఇనుప కడ్డీలు, అద్దాలు బలంగా తాకడంతో 23మంది విద్యార్థులు, ఉపాధ్యాయుల చేతులు, కాళ్లు, ముక్కు, చెవులకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు వారిని బయటకు తీసి ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు సీఐ ముష్కరాజ్ తెలిపారు.

## వాడపల్లి వెంకన్నకు 4టన్నుల కూరగాయలు అందజేత

### – మొక్కు తీర్చుకున్న నాళం రోశయ్య, సుజాత దంపతులు



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : కలియుగ ప్రత్యక్ష దైవం ద్వారక తిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి డైరెక్టర్‌గా పనిచేసిన నాళం సుజాత, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నాళం లక్ష్మి సూర్యనారాయణ(నాళం రోశయ్య) దంపతులు 4 టన్నుల కూరగాయలను అన్నదాన కార్యక్రమం నిమిత్తం వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయానికి పంపించి మొక్కు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి డైరెక్టర్‌గా సేవ చేసే భాగ్యాన్ని కల్పించిన స్వామి వారికి అన్నదానం నిమిత్తం కూరగాయలు అందిస్తామని నాళం రోశయ్య, సుజాతలు మొక్కుకున్నారు. ఈ మేరకు మొక్కు తీర్చుకుంటూ 4 టన్నుల కూరగాయలతో బుధవారం బయలుదేరిన వాహనాన్ని పాలచర్ల గ్రామంలోని కోదండరామాలయం వద్ద నుండి సూర్య ఉపాసకులు వడలి కుమార శర్మ, కొత్తూరి అన్నపూర్ణయ్య శర్మ(అనిల్ శర్మ)లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాళం రోశయ్య, సుజాత దంపతులు చేస్తున్న ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను అభినందించారు. స్వామి వారికి మరింతగా సేవచేసే అవకాశం భగవంతుడు నాళం దంపతులకు కల్పించాలని ఆకాంక్షించారు. వీరి ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు కారణంగా వారి కుటుంబంతో పాటు, గ్రామం సస్యశ్యామలం కావాలని ఆకాంక్షించారు. నాళం రోశయ్య మాట్లాడుతూ ద్వారక తిరుమలలో స్వామి వారి సేవ చేసుకొనే భాగ్యం లభించడం పూర్వజన్మ సుకృతం అని అన్నారు. ఆ భాగ్యం కల్పించిన స్వామివారికి అన్నదానం నిమిత్తం కూరగాయలు అందించాలన్న మొక్కును తీర్చుకుంటూ గత నెలలో ద్వారక తిరుమలకు 4టన్నుల కూరగాయాలను పంపించామని, ఇప్పుడు వాడపల్లి వెంకన్నకు అన్నదాన నిమిత్తం కూరగాయాలు పంపుతున్నామని తెలిపారు. స్వామివారికి మరింతగా సేవ చేసి తరించే భాగ్యం కల్పించాలని స్వామి వారిని కోరుకుంటున్నామన్నారు. రాజానగరం మండలం వైసిపి నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు మాట్లాడుతూ నాళం రోశయ్య, సుజాత దంపతులు ద్వారకా తిరుమల ట్రస్ట్ డైరెక్టర్‌గా చేసిన సేవలు అభినందనీయం అన్నారు. ద్వారక తిరుమలలో శ్రీవారిని ఎంతోమంది భక్తులు దర్శించుకోవడానికి సహకరించారని, బస్సులను ఏర్పాటు చేసి ఎంతో మంది భక్తులకు దర్శన భాగ్యం కల్పించారని తెలిపారు. దేవుని సేవ చేసేందుకు వీరికి మరిన్ని అవకాశాలు దక్కాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మిద్దే వీర్రాజు, మంచినీడి వీరబాబు, పిల్లా సత్య, సిద్ధిరెడ్డి బాబి, పిల్లా శ్రీను, వేముల తాతారావు, వేమగిరి కృష్ణ, వేముల శ్రీను, కామిరెడ్డి వీరపండు, పిల్లి లక్ష్మినారాయణ, బోయిడి గణపతి, దేవాబత్తుల దుర్గాప్రసాద్, కోసూరి భగవాన్, తదితరులు పాల్గొన్నారు.

## 10న నన్నయకు గవర్నర్ అబ్దుల్ నజీర్ రాక



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 16, 17వ స్నాతకోత్సవ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ హాజర వుతున్నారని వీసీ ఆచార్య ఎస్ ప్రసన్న శ్రీ తెలియజేశారు. గవర్నర్ కార్యాలయంలో వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ ను మర్యాదపూర్వకంగా కలిసి, స్నాతకోత్సవ ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. అనంతరం స్నాతకోత్సవానికి సంబంధించిన వివరాలను వీసీ తెలియజేసారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాల యంలో 2022-23, 2023-24 విద్యా సంవత్సరానికి చెందిన పిహెచ్.డీ, పీజీ, పీజీ డిప్లొమా, యూజీ అండ్ పీజీ ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసిన వారికి పట్టాలు అందిస్తామన్నారు. ఈ 16,17వ స్నాతకోత్సవానికి వివిధ కోర్సులకు చెందిన 722 మంది విద్యార్థులు అప్లై చేసుకున్నారని చెప్పారు. ఈ 722 మందిలో పిహెచ్.డి 21, గోల్డ్ మెడల్స్ 14, ప్రైజ్ 10, మిగిలిన వారు పీజీ కోర్సులు ఎంఏ, ఎంకామ్, ఎంబీఏ, ఎల్.ఎల్.ఎం, ఎంఎస్సీ, ఎంసీఏ, ఎంఈడీ, ఎల్.ఎల్.బి., బీఈడీ వంటి కోర్సులు పూర్తి చేసిన వారు ఉన్నారని తెలిపారు. రెండు విద్యా సంవత్సరాలలో విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 6113 మంది, అండర్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 45337 మంది విద్యార్థుల పట్టాలు ఆమోదిస్తారని తెలియజేసారు. యూనివర్సిటీ ఛాన్సలర్, గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా పీహెచ్.డి. గోల్డ్ మెడల్స్ పట్టాల ప్రదానం జరుగుతుందని తెలిపారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ విద్యావేత్త, భారతదేశంలోని సిక్కిం విశ్వవిద్యాలయం వ్యవస్థాపక వైస్ ఛాన్సలర్, జె.ఎన్.యూ సీనియర్ ప్రొఫెసర్ మహేంద్ర పి.లామా హాజరవుత ఎన్నారని అన్నారు.

**గవర్నర్ పర్యటన వివరాలు:**

ఏప్రియల్ 10వ తేదీ ఉదయం 9.40 గంటలకు విజయవాడ లోని లోక్ భవన్ నుండి బయలుదేరి 10.00 గంటలకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారు. హెలికాప్టర్ ద్వారా అక్కడి నుంచి ఉ.10.05 కు బయలు దేరి ఉ .10.45 గంటలకు రాజమహేంద్రవరంలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ప్రాంగణం లోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. స్వల్ప విరామం తరువాత ఉ.11.00 గంటలకు ఆదికవి నన్నయ యూనివర్సిటీకు చేరుకుని, 11.00 నుంచి మధ్యాహ్నం 12.05 గంటల వరకు నిర్వహించే 16వ,17 వ సంయుక్త కాన్వొకేషన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. అనంతరం మ.12.15 కు అక్కడి నుంచి బయలుదేరి మ.12.20 కు గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ హెలిప్యాడ్ కు చేరుకుని తీసుకుని, అతిథి గృహంలో స్వల్ప విరామం తీసుకుని మధ్యాహ్నం 12.55 గంటలకు హెలికాప్టర్ ద్వారా తిరిగి మ .1.00 గంటకు విజయవాడకు బయలుదేరుతారు. మ.13.40 గంటలకు విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుంచి మ.1.50 గంటలకు బయలుదేరి మ.2.10 గంటలకు లోక్ భవన్‌కు చేరుకుంటారు.

ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడి యత్నం

## పత్రికా స్వేచ్ఛపై దాడి

### ఎంపీ గంటి హరీష్ బాలయోగి



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

ఆంధ్రజ్యోతి కార్యాలయంపై జరిగిన దాడి యత్నం తీవ్రంగా ఖండనీయమని, ఇది పత్రికా స్వేచ్ఛను హరించడమేనని అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా సంస్థలు స్వేచ్ఛగా, నిర్భయంగా పనిచేయడం అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి దాడులు కేవలం ఒక సంస్థపై కాకుండా, మొత్తం పత్రికా రంగంపై దాడిగా పరిగణించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ ఘటనలో కొందరు వ్యక్తులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం దురదృష్టకరమని, హింసకు పాల్పడటం సమాజానికి హానికరమని అన్నారు. అమలాపురంలో ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడి చేయాలని జరిగిన ప్రయత్నం జిల్లాలో వైసీపీ విష సంస్కృతికి తార్కాణమని విమర్శించారు. ఈ ఘటనలను ప్రజలంతా గమనిస్తున్నారని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు. పత్రికా రంగం భద్రతను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఘటనపై చట్టం తన పని తాను చేసుకుంటుందని, బాధ్యులపై తగిన చర్యలు తప్పవని ఎంపీ గంటి హరీష్ బాలయోగి పేర్కొన్నారు.

శస్త్రచికిత్సలో చరిత్ర సృష్టించిన

## క్యాపిటల్ హాస్పిటల్

### డాక్టర్ విజయ్ కుమార్ నేతృత్వంలో అరుదైన శస్త్రచికిత్స విజయవంతం

### సెరిబ్రల్ పాల్సీ, స్పాస్టిక్ పారాప్లీజియాతో బాధపడుతున్న 9 నెలల బాలికకు నూతన జీవం



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

వైద్య రంగంలో క్యాపిటల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మరోసారి తన ప్రతిభను చాటుకుంది. సాధారణంగా జీవితాంతం వైకల్యంతో బాధపడాల్సి వస్తుందని భావించే సెరిబ్రల్ పాల్సీ, స్పాస్టిక్ పారాప్లీజియా వంటి క్లిష్ట వ్యాధులకు ఆధునిక శస్త్రచికిత్సల ద్వారా శాశ్వత ఉపశమనం కల్పిస్తూ అరుదైన విజయాన్ని సాధించింది. ముఖ్యంగా కేవలం 9 నెలల చిన్నారిపై ఇంత క్లిష్టమైన శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించడం వైద్యరంగంలో విశేషంగా నిలిచింది. అమలాపురం పరిసర ప్రాంతానికి చెందిన ఓ చిన్నారి సెరిబ్రల్ పాల్సీతో పాటు స్పాస్టిక్ పారాప్లీజియా వంటి తీవ్రమైన సమస్యతో బాధపడుతోంది. ఈ వ్యాధుల కారణంగా కండరాలు బిగుసుకుపోయి కాళ్ల కదలికలు పూర్తిగా దెబ్బతిన్నాయి. నడవడం, నిలబడటం వంటి ప్రాథమిక శారీరక చర్యలు కూడా సాధ్యం కాని పరిస్థితి నెలకొంది. సమయానికి సరైన చికిత్స అందించకపోతే భవిష్యత్తులో పూర్తిగా మంచానికే పరిమితమయ్యే ప్రమాదం ఉందని వైద్యులు గుర్తించారు. ఈ క్లిష్ట పరిస్థితిని సవాలుగా స్వీకరించిన క్యాపిటల్ హాస్పిటల్ వైద్య బృందం, ప్రముఖ ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ విజయ్ కుమార్ నాయకత్వంలో సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగింది. చిన్నారి వయస్సు తక్కువగా ఉండటం, ఒకేసారి అనేక కండరాలపై ప్రభావం ఉండటం వంటి సవాళ్లను అధిగమిస్తూ అత్యంత జాగ్రత్తగా శస్త్రచికిత్సలు నిర్వహించారు. బాలికకు కదలికలు పునరుద్ధరించేందుకు పలు కీలక శస్త్రచికిత్సలను వరుసగా నిర్వహించారు. ఎడక్టర్ టెనోటమీ ద్వారా తొడ కండరాల బిగుతును తగ్గించి కాళ్లు విస్తరించుకునే సామర్థ్యాన్ని పెంచారు. ఆబ్చురేటర్ న్యూరెక్టమీ ద్వారా కండరాల అధిక గట్టితనాన్ని నియంత్రించారు. హ్యామ్‌స్ట్రింగ్ రిలీజ్ ద్వారా మోకాళ్ల కదలికను మెరుగుపరిచారు. టెండో ఎకిలీస్ లెంగ్తెనింగ్ ద్వారా కాలి కండరాలను సడలించి భవిష్యత్తులో నడకకు అనుకూల పరిస్థితులు సృష్టించారు. ఈ శస్త్రచికిత్సలన్నింటినీ అత్యంత ఖచ్చితత్వంతో నిర్వహించడం ద్వారా బాలికకు క్రమంగా కదలికలు తిరిగి వచ్చేలా వైద్యులు విజయాన్ని సాధించారు. గతంలో ఇలాంటి శస్త్రచికిత్సలు చిన్న వయస్సు ఉన్న పిల్లలకు నిర్వహించిన అనుభవం ఉన్నప్పటికీ, కేవలం 9 నెలల చిన్నారిపై ఒకేసారి ఇన్ని శస్త్రచికిత్సలు చేయడం వైద్యపరంగా అరుదైన ఘనతగా నిలిచింది. ఈ విజయం వెనుక డా. విజయ్ కుమార్ యొక్క విస్తృత అనుభవం, ఖచ్చితమైన వైద్య ప్రణాళిక, నిబద్ధత కీలక పాత్ర పోషించాయి. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని వైద్యులు తెలిపారు. ఫిజియోథెరపీ ద్వారా మరింత మెరుగుదల సాధించే అవకాశం ఉందని, త్వరలోనే సాధారణ కదలికలు సాధించే దిశగా పురోగతి కనిపిస్తోందని వెల్లడించారు. సెరిబ్రల్ పాల్సీ వంటి వ్యాధులు మెదడుకు తగిన ఆక్సిజన్ అందకపోవడం, ప్రసవ సమయంలో సమస్యలు, ఫిట్స్ వంటి కారణాల వల్ల ఏర్పడతాయని వైద్యులు వివరించారు. అయితే సమయానికి సరైన వైద్యం అందిస్తే పిల్లల జీవితాన్ని పూర్తిగా మార్చేయవచ్చని ఈ ఘటన స్పష్టంగా నిరూపించింది. హైదరాబాద్, విజయవాడ వంటి మహానగరాల్లో మాత్రమే అందుబాటులో ఉండే అత్యాధునిక ఈ విజయంతో సెరిబ్రల్ పాల్సీతో బాధపడుతున్న అనేక చిన్నారుల కుటుంబాలకు కొత్త నమ్మకం కలిగింది. ఈ అరుదైన శస్త్రచికిత్స విజయవంతం కావడంతో డా. విజయ్ కుమార్, క్యాపిటల్ హాస్పిటల్ వైద్య బృందంపై ప్రశంసల వర్షం కురుస్తోంది. చిన్నారికి కొత్త జీవం అందించిన ఈ వైద్యసేవలు ప్రాంతీయ వైద్య రంగంలో ఒక మైలురాయిగా నిలిచాయి.

గెద్దాడ వారి వివాహ వేడుకలో పాల్గొన్న

## ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండల జనసేన నాయకులు గెద్దాడ త్రిమూర్తులు ప్రత్యేక ఆహ్వానం మేంకు ఎస్వి రాజు ఫంక్షన్ హాలులో జరిగిన వివాహ వేడుకలో రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, నాసేన కోసం నా వంతు కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి పాల్గొని నూతన వధూవరులు రాజేష్ మరియు పావనిలను ఆశీర్వదించారు. వీరితోపాటు జనసేన,తెలుగుదేశం,బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటిలింగేశ్వర స్వామి ఆలయానికి

## మహిమాన్విత ఆర్చ్ నిర్మాణం

**- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, చైర్మన్ కొయ్యల రమణ**

**- రూ. 20 లక్షలతో నిర్మాణం పనులకు శంకుస్థాపన - హాజరైన ప్రముఖులు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి గట్టు కోటిలింగాల రేవులో కొలువైన కోటిలింగేశ్వరస్వామి ఆలయానికి మహిమాన్వితమైన ఆర్చ్‌ను నిర్మిస్తున్నట్లు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే అన్నారు. స్థానిక కోటిలింగాలపేట రోడ్డు ప్రారంభం వద్ద రూ. 20 లక్షలతో నిర్మించతలపెట్టిన ఆర్చ్ నిర్మాణం పనులకు ఆలయ చైర్మన్ కొయ్యల రమణ శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ తన హయాంలో కోటిలింగేశ్వర స్వామి ఆలయంకు వెళ్లే ప్రధాన మార్గంలో ఆర్చ్ నిర్మాణానికి అంకురార్పణ జరగడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. "అభివృద్ధి మన భవిష్యత్తు అయితే... ఆధ్యాత్మికత మన మూలాలన్నారు. ఈ రెండూ కలిసినప్పుడే సమాజం సంపూర్ణంగా ముందుకు సాగుతుంది" అని పేర్కొన్నారు. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని

**రూ. 20 లక్షలతో ఆర్చ్ నిర్మాణం - అద్భుత డిజైన్ :**

ఆలయ చైర్మన్ కొయ్యల రమణ... దాతల సహకారంతో సుమారు రూ. 20 లక్షల వ్యయంతో ఈ ఆర్చ్ నిర్మాణం చేస్తున్నట్టు తెలిపారు. రెండు నెలల్లో పనులు పూర్తవుతాయని వెల్లడించారు. ఇప్పటికే రూపొందించిన డిజైన్ భక్తులను ఆకట్టుకునే విధంగా ఉందని ఎమ్మెల్యే వాసు అభినందించారు.

**ఏప్రిల్ 12న భారీ అభివృద్ధి పనుల ప్రారంభం :**

ఈ నెల 12వ తేదీన ఎండోమెంట్స్ మంత్రి నగరానికి వస్తున్నారని ఆ సందర్భంగా రూ. 7 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారని తెలిపారు. మొత్తంగా రూ. 9 కోట్ల 10 లక్షల నిధులు నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి తమ కూటమి ప్రభుత్వం కేటాయించినట్లు వెల్లడించారు.

**ఇది వాగ్దానం కాదు... అమలు :**

గతంలో పుష్కరాల పనులపై వచ్చిన ప్రశ్నలకు సమాధానంగా... "రోడ్లు, జంక్షన్లు అభివృద్ధి చేస్తాం... కానీ దేవాలయాల మహిమాన్వితత పెంచడం మా మొదటి ప్రాధాన్యత" అని ఎమ్మెల్యే వాసు స్పష్టం చేశారు.

**15 ఏళ్ల కల నెరవేరింది : పంతం కొండలరావు**

పంతం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పంతం కొండలరావు మాట్లాడుతూ ఈ ఆర్చ్ నిర్మాణం కోసం 15 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నామని, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సహకారంతో ఈ కల సాకారమైందని తెలిపారు. దాతలు, వ్యాపారవేత్తలు అందరూ చూపిన సహకారం అభినందనీయమన్నారు.

**ఆలయ అభివృద్ధికి మరిన్ని ప్రణాళికలు : చైర్మన్ కొయ్యల రమణ**

దేవస్థానం చైర్మన్ కొయ్యల రమణ మాట్లాడుతూ తమ కమిటీ ప్రమాణ స్వీకారం చేసిన రోజునే ఆర్చ్ నిర్మాణం సంకల్పించామని, దాతల సహకారంతో ఆ సంకల్పాన్ని కార్యరూపం దాల్చిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. దేవాలయాల అభివృద్ధి ద్వారా సంస్కృతి, సంప్రదాయాలు కాపాడబడతాయని పేర్కొన్నారు. దేవాలయం ఉన్న చోట ధర్మం ఉంటుందని, ధర్మం ఉన్న చోట అభివృద్ధి తప్పకుండా ఉంటుందన్నారు. కాగా ఈ కార్యక్రమానికి స్థానిక వ్యాపారవేత్తలు, భక్తులు విరాళాలు అందించారు. ముఖ్యంగా బిక్కిన రవి అనే వ్యక్తి రూ. 1,01,118 విరాళం అందించడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గన్ని కృష్ణ, కాశీ నవీన్ కుమార్, వర్రే శ్రీనివాసరావు, అత్తి సత్యనారాయణ, నందివాడ దినేష్, కంటిపూడి శ్రీను, రెడ్డి మణేశ్వరరావు బుడ్డిగ రవి, బంగారు నాగేశ్వరరావు, జవ్వాది మురళి, బొర్రా చిన్ని, ఆలయ డైరెక్టర్లు తోట కిరణ్, గుబ్బల గంగాభవానీ, జొన్నా సత్యవేణి, వంగండ త్రివేణి, సంపంగి లక్ష్మీదుర్గ, అలజంగి దేవుడు, జీవీఆర్ రెడ్డి, నిమిష కవి, పిల్లి ప్రసాద్, మద్దుకూరి అనురాధ, స్థానిక పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నా కుమారుడి మరణానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోండి

### జిల్లా ఎస్పీకి బాధిత కుటుంబం ఫిర్యాదు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తన కుమారుడిని వేధింపులకు గురిచేసి ఆత్మహత్యకు ప్రేరేపించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీకి బాధిత కుటుంబం ఫిర్యాదు చేసింది. ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన యువకుడి తండ్రి రాజస్థాన్ రాష్ట్రం, ఉగమ్మా వాస్ గ్రామానికి చెందిన కాలు రామ్, పెదనాన్న అశోక్ కుమార్ తదితరులతో కలిసి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డి.నరసింహ కిషోర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తండ్రి కాలు రామ్, పెదనాన్న అశోక్ కుమార్‌లు మాట్లాడుతూ కుమారుడు నారాయణ లాల్ జీవనోపాధి నిమిత్తం నాలుగు సంవత్సరాల క్రితం రాజస్థాన్ నుండి రాజమహేంద్రవరం నగరానికి వచ్చాడని తెలిపారు. మొబైల్ రిపేర్ పనులు నేర్చుకొని, మే, 2025న జై భవాని మొబైల్స్" అనే పేరుతో మెదరపేట లో వ్యాపారాన్ని ప్రారంభించాడని వివరించారు. రాజమహేంద్రవరం మొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ రాజమహేంద్రవరం హోల్ సేల్ అండ్ రిటైల్ మొబైల్ అసోసియేషన్ మధ్య సభ్యుల సంక్షేమం, పరస్పర సహకారం కోసం కుదిరిన ఎం ఓ యు ను నిందితులు దుర్వినియోగం చేసి, చట్ట విరుద్ధంగా నా కుమారుడి వ్యాపారం పై బ్యాన్ విధించి, జరిమానాలు విధించి, మానసిక క్షోభకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నా కుమారుడు వేధింపులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. తన కుమారుడు ప్రారంభంలో అప్పటి ఆర్డబ్ల్యూఆర్ఎంఏ జుయింట్ సెక్రటరీ ఇంద్రకుమార్ వద్ద కొంతకాలం పనిచేశాడని తెలిపారు. అనంతరం తనకు తానుగా నూతన వ్యాపారం ప్రారంభించాడని అన్నారు. తన కుమారుడి పై ఇంద్రకుమార్, అతని సోదరుడు అర్జున్ కుమార్ అసూయ, ద్వేషంతో నా కుమారుడిపై కక్ష పెంచుకొని వేధింపులకు గురి చేశారని వివరించారు. ఇంద్రకుమార్, అర్జున్ కుమార్, డాగ్రారామ్ అనే వ్యక్తి, ఇతర సభ్యులు, యస్. హేమంత్, ఖాళేశా సహకారంతో నా కుమారుడి అంతు చూస్తామని బెదిరించారని అన్నారు. ఈ వ్యవహారంలో ఇంద్రకుమార్, అర్జున్ కుమార్, అర్జున్ పటేల్ ,బి. వేణుగోపాల్, ఎం.డి. ఖలీల్, ఎస్. హేమంత్, కాళేశా, డాగ్రారం తదితరులు కలిసి కుట్రపూర్వకంగా నా కుమారుడి షాపుపై బ్యాన్ విధించి ఎవరైనా "జై భవాని మొబైల్స్"తో వ్యాపారం చేస్తే మొదటిసారి రూ.5వేలు,తదుపరి రూ.10వేలు జరిమానా ప్రకటించి వేధింపులకు గురి చేశారని అన్నారు. నా కుమారుడు నారాయణ లాల్ ఆత్మహత్యకు కారకులయిన కలేపా, గోపాల్, హేమంత్, డాగ్రారామ్ పైన చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజ్ మాలి, విక్రమ్ వైష్ణవ్, జేతారాం, లక్ష్మీ కుమార్, రన్ బో డారామ్, జయంతి లాల్, ప్రకాష్ కుమార్ గోపిలాల్, కేతారాం తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా

## కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది

### టిడ్కో ఫ్లాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు తెలిపారు. టిడ్కో ఫ్లాట్లకు సంబందించిన లబ్ధిదారులు విద్యుత్ సమస్యలు ఉన్నాయని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావుకి తెలపగా ఆయన వెంటనే స్పందించి బుధవారం మున్సిపల్, టిడ్కో, ఎలక్ట్రికల్ అధికారులతో కలిసి టిడ్కో ఫ్లాట్లను పరిశీలించి లబ్ధిదారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి పేదవాడు తన సొంత ఇంట్లో గౌరవంగా, అన్ని వసతులతో జీవించాలని ఆయన అన్నారు. మౌలిక సదుపాయాల విషయంలో ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదన్నారు. విద్యుత్, తాగునీరు డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, పెదపాటి సత్తిబాబు కూటమి నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ కమీషనర్ టి.వి.రంగారావు, టిడ్కో ఏ.ఈ, ఎలక్ట్రికల్ ఏ.ఈ, మున్సిపల్ సచివాలయ సిబ్బంది, తదితర్లు పాల్గొన్నారు.

విపత్కర పరిస్థితిలో

## యూనియన్ అండగా ఉంటాం

### ప్రసాద్ కుటుంబానికి గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ సహాయం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం గౌరవ అధ్యక్షులు కీ.శే.ఎంవిజీవి ప్రసాద్ ఇటీవల అకాల మరణం కాబడినారు. ఆయన కుటుంబానికి యూని యన్ ద్వారా కిరాణా సరుకులు మరియు బియ్యం బస్తా, ఈఎస్ఐ నుండి 15వేల రూపాయలు నగదు రూపాయలు వారి కుటుంబానికి యూనియన్ సభ్యులు అందజేసారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ బొజ్జ రామకృష్ణ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ యూనియన్ సభ్యత్వాలు విషయంలో అప్డేట్ గా ఉండాలని ఉన్న ఎడల మనకు ఎటువంటి విపత్కర పరిస్థితి వచ్చినచో యూనియన్ అండగా ఉంటాదని ఈ సందర్భంగా తెలియజేస్తూ అలాగే ప్రసాద్ కుటుంబానికి మనోధైర్యాన్నిస్తూ ఆ భగవంతుడు ఆశీస్సులు వారి కుటుంబానికి ఎప్పుడు ఉండాలని ప్రసాద్ ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ ఆశపు శ్రీనివాస్ (బుజ్జి), కమిటీ మెంబర్ చందు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు, అమలాపురం నియోజకవర్గాల

## ప్రజలకు ఇంటింటికి శుద్ధమైన తాగునీటి సౌకర్యం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట నియోజకవర్గంలో భారీ మెగావాటర్ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన కొత్తపేట నియోజకవర్గ ప్రజలకు శాశ్వత తాగునీటి సమస్య పరిష్కార దిశగా మరో కీలక అడుగు పడుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ ఆధ్వర్యంలో, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అమలు చేస్తున్న అమరజీవి జలధార పథకంలో భాగంగా, భారీ మెగా వాటర్ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించబడనుంది. ఈ కార్యక్రమం ఉదయం 09:00 గంటలకు, ఆత్రేయపురం మండలం వసంతవాడ గ్రామంలో జరుగుతుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా కొత్తపేట నియోజకవర్గంతో పాటు పి. గన్నవరం, రాజోలు, అమలాపురం నియోజకవర్గాల ప్రజలకు ఇంటింటికి శుద్ధమైన తాగునీటి సౌకర్యం కల్పించబడుతుంది. జల జీవన్ నిధుల ద్వారా చేపట్టబడుతున్న ఈ ప్రాజెక్ట్, వేలాది కుటుంబాలకు మేలుకలిగించనుంది. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

## వానపల్లిలో విషాదం

### మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించించిన ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** వానపల్లి గ్రామంలో జరిగిన రెండు విషాద ఘటనలు స్థానికంగా తీవ్ర కలకలం రేపాయి. గ్రామానికి చెందిన అడపా రామకృష్ణ పాము కాటుకు గురై మరణించగా, అదే గ్రామానికి చెందిన బద్రి పల్లలమ్మ గతంలో బండారు పేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి,చికిత్స పొందుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందారు. ఈ ఘటనలపై స్పందించిన కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

## సీతానగరంలో మండలంలో గాలివాన బీభత్సం

### నేలకొరిగిన పంట పొలాలు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలో పలుచోట్ల గాలి వాన బీభత్సం సృష్టించింది. ఆకస్మికంగా కురిసిన గాలివాన ప్రజలను భయాందోళనకు గురి చేసింది. బలమైన ఈదురుగాలులతో పాటు మోస్తరు నుంచి భారీ వర్షం కురవడంతో ప్రాంతం మొత్తం అల్లకల్లోలంగా మారింది ఈదురు గాలుల వేగం ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఇళ్లలోనే ఉండిపోగా బయట పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి. దీని ప్రభావంతో పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. చేతికొచ్చిన పంట పొలాలు నేలకు ఒరగడంతో అన్నదాతలు ఆదుకోవాలని అధికారులను వేడుకుంటున్నారు.

## పంచాయతీ అభివృద్ధి అధికారులు జి.ఓ నెంబర్ 60ను రద్దు చేయాలి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** బుధవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం పంచాయతీ అభివృధి అధికారులు జి.ఓ నెంబర్ 60ను రద్దు చేయాలని కోరుతూ స్థానిక మండల అభివృద్ధి అధికారివారికి మరియు డిప్యుటీ ఎంపీడీఓ (స్వర్ణ గ్రామ సచివాలయం ) వారికి వినతి పత్రం సమర్పించడం అయినది. ప్రభుత్వ అప్పగించిన ఏపని ,ఏ సర్వే అయినా ముందుండి చేసే స్వర్ణ వార్డు ఉద్యగులు అయిన పంచాయతీ అభివృద్ధి అధికారులను మాత్రమే చిన్నచూపు చూడటం అమానుషం, ఇంటి పన్నులు వసూలు క్షేత్ర స్థాయి లో మంచి గా పనిచేసారు అని చెప్తూనే ప్రభుత్వ పై స్థాయి ఉద్యోగులు తమకు, తమ కుటుంబాలకు ఆర్థికంగా కిందకు నెట్టాయటం కొరకు తీసుకున్న నిర్ణయం లా ఉంది అని తమగోడు విని తమకు న్యాయం చేయాలి అని పంచాయతీ అభివృద్ధి అధికారులు వాపోతున్నారు. పంచాయతీ అభివృద్ధి అధికారులు గ్రేడ్-3 స్థాయి, బరువు, బాధ్యతలు పెంచి జీతం మాత్రం తగ్గించిన మంచి ప్రభుత్వం వాపోయారు.




# జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి వేగం

## యువతకు స్వయం ఉపాధి అవకాశాలు : జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి పెద్దపీట వేస్తూ, యువతకు స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరచడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 19వ జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక మండలి సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, క్వాయర్ (కొబ్బరి పీచు) ఆధారిత ఉత్పత్తుల తయారీ కోసం నిర్మిస్తున్న ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్, ఎంఎస్ఎంఈ పార్క్ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఏపీఐఐసీ, పంచాయతీరాజ్ విభాగాలు సమన్వయంతో మౌలిక వసతులను త్వరితగతిన కల్పించాలని సూచించారు. క్వాయర్ బోర్డు సహకారంతో జిల్లాలో అంతర్జాతీయ స్థాయి ఉత్పత్తుల తయారీ అవకాశాలపై అధ్యయనం చేయాలని తెలిపారు. క్వాయర్ జియో-టెక్స్‌టైల్స్ మ్యాట్లు, ఫైబర్ ఉత్పత్తులు, రబ్బరైజ్డ్ క్వాయర్ మెట్రెస్సులు, కుండీలు, అలంకరణ వస్తువుల తయారీని ప్రోత్సహించాలని పేర్కొన్నారు. పర్యావరణ హిత ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇస్తూ, వక్క అరటి ఆకులతో విస్తరాకులు తయారీ యూనిట్లను స్థాపించేలా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని సూచించారు. దీని ద్వారా ప్లాస్టిక్ వినియోగం తగ్గడంతో పాటు రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని చెప్పారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద సముద్రపు నాచు పెంపకం, ప్రాసెసింగ్ కోసం 200 మంది లబ్ధిదారులను ఎంపిక చేయాలని మత్స్యశాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారులను ఆదేశించారు. వీరికి సబ్సిడీ రుణాలు, శిక్షణ అందించి తీర ప్రాంత ప్రజల ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని పేర్కొన్నారు. జిల్లాలో ఉత్పత్తి అయ్యే ఖాదీ, చేనేత ఉత్పత్తుల విక్రయాలను విస్తరించేందుకు ఆర్టీసీ డిపోలు, రైతు బజార్లు, ప్రధాన కూడళ్లలో ప్రదర్శన, విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. వీఐపీ స్టోర్లలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా మార్కెటింగ్‌ను బలోపేతం చేయాలని ఆదేశించారు. నూతన పరిశ్రమల స్థాపనకు ఎలాంటి జాప్యం లేకుండా సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకున్న పరిశ్రమలకు నిర్ణీత గడువులోగా అనుమతులు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. పారిశ్రామికవేత్తలు, స్వయం ఉపాధి అభ్యర్థులకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ డిప్యూటీ జనరల్ మేనేజర్ రాధామణి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ అరుణ, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ అంబటి భూలక్ష్మి, డిపిఓ శ్రీనివాసరావు, ఎల్‌డిఎం కేశవ్ వర్మ, డిహెచ్ఓ బి.వి. రమణ, పంచాయతీరాజ్ ఎస్సీ పులి రామకృష్ణారెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# సమాజమే దేవాలయం - ప్రజలే దేవుళ్లు : ముత్యాల బాబ్జి



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రుల ఆత్మగౌరవం నినాదంతో పుట్టిన పార్టీ నిబద్ధత, సిద్ధాంతం కలిగిన పార్టీ మూల సిద్ధాంత దృక్పథం తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం తెలుగుదేశం పార్టీ యొక్క సిద్ధాంతం ఒక స్పష్టమైన భావనపై ఆధారపడి ఉంది: సమాజమే దేవాలయం - ప్రజలే దేవుళ్లు అంటే పాలన అనేది అధికారానికి కాదు, ప్రజలకు సేవ చేయడానికి ఉండాలి. ప్రతి పౌరుడికి గౌరవం, న్యాయం, సమాన అవకాశాలు అందించడమే లక్ష్యం తెలుగు ప్రజల "ఆత్మగౌరవాన్ని నిలబెట్టడం, సామాజిక న్యాయం ద్వారా సమానత్వాన్ని సాధించడం ప్రజా కేంద్రిత పారదర్శక పాలనను అందించడం, అభివృద్ధి మరియు సంక్షేమాన్ని సమన్వయం చేయడం" ఇదే తెలుగుదేశం పార్టీ సిద్ధాంత సారం.పార్టీ చిహ్నాల అర్థం తెలుగుదేశం పార్టీ చిహ్నాలు కేవలం గుర్తులే కాదు. ప్రజల ఆశయాలు, ఆకాంక్షలు, జీవన విధానాన్ని ప్రతిబింబించే విలువలు. పసుపు జెండా శుభాన్ని, సమృద్ధిని,ఆశను సూచిస్తుంది.గుడిసె,చక్రం, నాగలి ఇవి గ్రామీణ మూలాలను, శ్రమజీవుల పురోగతిని,కష్టజీవుల సంక్షేమాన్ని ప్రతిబింబిస్తాయి సైకిల్ ఇది సామాన్యుడి కి అందుబాటులో ఉండే సాధనం ప్రగతిని, సమాన అవకాశాలను, ప్రతి ఒక్కరినీ ముందుకు తీసుకెళ్లే శక్తిని సూచిస్తుంది.

తెలుగుదేశం పార్టీ యొక్క మూల స్తంబాలు

**తెలుగు జాతి - విశ్వ ఖ్యాతి:** ప్రపంచవ్యాప్తంగా తెలుగు వారి గౌరవం, గుర్తింపును పెంపొందించడం,

**స్త్రీ శక్తి:** మహిళలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ అవకాశాలు కల్పించడం.,పేదల సేవలో బలహీన వర్గాల అభివృద్ధి, కుల అసమానతల నివారణ, సమాన సమాజ నిర్మాణం.యువ గళం యువతకు నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు, అభివృద్ధిలో భాగస్వామ్యం.అన్నదాతకు అండగా వ్యవసాయం, రైతుల సంక్షేమం, గౌరవం మరియు స్థిరత్వం.

**కార్యకర్తే అధినేత:** గ్రామ స్థాయి నుంచి నాయకత్వాన్ని పెంపొందించడం, కార్యకర్తలకు ప్రాధాన్యం.

**సిద్ధాంతం యొక్క పరిణామం:** ఎన్టీఆర్ నాయకత్వంలో, తెలుగుదేశం పార్టీ ఆత్మగౌరవం మరియు ప్రజా ఉద్యమంగా ఆవిర్భవించి, చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆధునికతతో కొత్త దిశలో ఎదుగుతోంది.

**ప్రాంతీయ గర్వం - జాతీయ దృక్పథం:** తెలుగు గౌరవాన్ని నిలబెట్టుతూ, జాతీయ రాజకీయాల్లో ప్రభావం చూపుతూ,రాష్ట్రాల అభివృద్ధే దేశ అభివృద్ధికి పునాది అనే భావనతో ముందుకు సాగే సిద్ధాంతం.

**ప్రజల పార్టీ - ప్రజల కోసం:** తెలుగుదేశం పార్టీ కేవలం ఒక పార్టీ కాదు. రైతు నుంచి యువత వరకు, మహిళల నుంచి బలహీన వర్గాల వరకు ప్రతి ఒక్కరి కోసం నిలబడి, వారి ఆశలు, ఆకాంక్షలను మోస్తూ ముందుకు సాగే నిజమైన ప్రజల ఉద్యమం. "ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, అభివృద్ధి, ప్రజాసేవలపై ఆధారపడి ఉన్న తెలుగుదేశం సిద్ధాంతం, కాలంతో పాటు మారుతూ, ఎప్పటికీ ప్రజల కోసం పోరాడే శక్తివంతమైన భావజాలం" అని ముత్యాల బాబ్జి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు తెలియజేశారు.

# కొత్తపేట బార్ అసోషియేషన్ అధ్యక్షులుగా ఎం.వి.వి.ఎస్.ప్రసాద్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట బార్ అసోసియేషన్ 2026-2027 సంవత్సర కాలానికి గాను నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో జరిగిన ఈ ఎన్నికల ప్రక్రియలో సభ్యులందరి ఏకాభిప్రాయంతో కమిటీని ఎంపిక చేసినట్లు ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించారు. నూతన కార్యవర్గ వివరాలు అధ్యక్షులుగా ఎం.వి.వి.ఎస్. ప్రసాద్, ఉపాధ్యక్షులుగా బొంతు గౌరీ శంకర్, జనరల్ సెక్రటరీ గా పడాల వెంకటరెడ్డి, జాయింట్ సెక్రటరీ, జి.శంకరుడు, కోశాధికారిగా జి.విజయ్,లైబ్రెరీ సెక్రటరీగా, జి.బాలప్రతాప్‌లు ఎన్నికయ్యారు. పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ ఈ ఎన్నికలకు చీఫ్ ఎన్నికల అధికారులుగా సీనియర్ న్యాయవాదులు, ఎ.టి.ప్రభాకర్, జి.పి.నాయుడు వ్యవహరించగా,వారికి సహాయకులుగా, టి.సత్య మోహన్, జి.సునీల్ వర్మలు పర్యవేక్షించారు. ఎటువంటి పోటీ లేకుండా, అత్యంత సామరస్య పూర్వక వాతావరణంలో ఎన్నికలు ముగియడంపై అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. నియామక పత్రాల అందజేతలిఎన్నిక ప్రక్రియ అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులకు ఎన్నికల అధికారి జి.పి.నాయుడు చేతులమీదుగా అధికారిక నియామక పత్రాలను అందజేశారు. అభివృద్ధికి కట్టుబడి ఉంటాంలిఈ సందర్భంగా నూతన అధ్యక్షులు ఎం.వి. వి.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ,తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన తోటి న్యాయవాదులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాదుల సంక్షేమానికి మరియు బార్ అసోసియేషన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను తోటి న్యాయవాదులు ఘనంగా సన్మానించి,శుభాకాంక్షలు తెలియజేశారు.

# అమలాపురంలో ఘనంగా అల్లు అర్జున్ జన్మదిన వేడుకలు

## వగ్రే శేషు ఆధ్వర్యంలో అభిమానుల సంబరాలు




**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

అమలాపురంలో సినీ హీరో అల్లు అర్జున్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. టౌన్ పరిధిలో అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వగ్రే శేషు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం అభిమానుల ఉత్సాహంతో ప్రత్యేకంగా నిలిచింది. స్థానిక గీత ఆశ్రమం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకలకు అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జాతీయ ఉత్తమ నటుడిగా గుర్తింపు పొందిన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులు ప్రత్యేక కేక్‌ను కట్ చేసి తమ అభిమానాన్ని వ్యక్తపరిచారు. హ్యాపీ బర్త్‌డే అల్లు అర్జున్ అంటూ నినాదాలు చేస్తూ కార్యక్రమాన్ని ఉత్సాహంగా కొనసాగించారు. ఈ సందర్భంగా వగ్రే శేషు మాట్లాడుతూ అల్లు అర్జున్ కేవలం సినీ హీరో మాత్రమే కాకుండా యువతకు ప్రేరణగా నిలిచే వ్యక్తి అని తెలిపారు. ఆయన సినిమాల్లో చూపించే కృషి, క్రమశిక్షణ, వినయం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. అభిమానిగా అల్లు అర్జున్ పుట్టినరోజును సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. జన్మదిన వేడుకల భాగంగా అనాధలకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషంగా నిలిచింది. ఆశ్రమంలో నివసిస్తున్న వారికి భోజనాన్ని అందజేసి అభిమానులు మానవతా విలువలను చాటుకున్నారు. అదేవిధంగా గోవుల సంరక్షణ కోసం దానా నిమిత్తం ఆశ్రమం సెక్రటరీ కోకా రాంబాబుకు నగదు సహాయాన్ని అందజేశారు. ఈ చర్యల ద్వారా సమాజ సేవకు తమ కట్టుబాటును అభిమానులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అభిమానులు మంగా మహేష్, తోట నాగేశ్వరరావు, చిక్కాల శేషు, శృంగావరపు ప్రసాద్, అల్లు శ్రీను, అంబటి రమణ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మొత్తం కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగి, అభిమానుల ఐక్యతను ప్రతిబింబించింది. మొత్తంగా, అమలాపురంలో జరిగిన ఈ జన్మదిన వేడుకలు కేవలం సంబరాలకు పరిమితం కాకుండా సేవా కార్యక్రమాలతో కూడిన ఒక సామాజిక బాధ్యతను గుర్తు చేసిన సందర్భంగా నిలిచాయి. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వగ్రే శేషు నాయకత్వం అభిమానుల ప్రశంసలను అందుకుంది.

### పదో తరగతి మూల్యాంకనం

# నిబద్ధతతో నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

పదో తరగతి మూల్యాంకనం సజావుగా, నిబద్ధతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సూచించారు. ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి అత్యంత కీలకమైన మలుపు అని, పదేళ్లపాటు పడ్డ కష్టానికి ఈ మార్కులే పునాది అవుతాయని అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల సమాధాన పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. అక్కడ జరుగుతున్న ప్రక్రియను జిల్లా విద్యాశాఖాధికారి, స్పాట్ మూల్యాంకన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మూల్యాంకన విధుల్లో ఉన్న విద్యాశాఖ అధికారులు, ప్రధానాచార్యులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి సమాధాన పత్రాన్ని జాగ్రత్తగా, నిశితంగా పరిశీలించాలని సూచించారు. చిన్న పొరపాటు వల్ల విద్యార్థి తన అర్హతకు తగిన మార్కులు కోల్పోయే ప్రమాదం ఉందని, అది వారి ఉన్నత చదువులపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. మూల్యాంకనంలో పూర్తి నిబద్ధత, పారదర్శకత పాటించాలని, బోర్డు అందించిన కీ ప్రకారం మార్కులు కేటాయించాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పని చేయాలని, ఫలితాలను సకాలంలో విడుదల చేయడం విద్యార్థుల భవిష్యత్తుకు ముఖ్యమని చెప్పారు. సమయపాలనతో పాటు నాణ్యతను కాపాడుతూ ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు బాధ్యతతో, నిష్పక్షపాతంగా సమాధాన పత్రాలను మూల్యాంకనం చేయాలని, ప్రతి విద్యార్థికి న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. సమయపాలన, క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేస్తే సరైన ఫలితాలు అందించగలమని తెలిపారు. మూల్యాంకనంలో పాల్గొంటున్న ఉపాధ్యాయులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా త్రాగునీరు, విద్యుత్, భోజన వసతులు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎండలను లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి పి.నాగేశ్వరరావు, ఏసీ హనుమంతరావు, డిప్యూటీ క్యాంప్ అధికారులు కె.వెంకటేశ్వరరావు, పి.రామలక్ష్మణమూర్తి, తహసీల్దార్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

### వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులను

# రైతులు అందిపుచ్చుకోవాలి

## కిసాన్ మేళాకు తరలి వెళ్తున్న బస్సును జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు




**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులు లాభసాటి పంటల వైపు మళ్లాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు. జిల్లా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ, ఆత్మ సౌజన్యంతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మారుటేరులో జరుగుతున్న కిసాన్ మేళాకు తరలి వెళ్తున్న బస్సును ఆయన రావులపాలెం క్యాంప్ కార్యాలయం నుండి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో వస్తున్న నూతన సాంకేతికతను రైతులు అందిపుచ్చుకోవాలని సూచించారు. అందుకు ఇటువంటి విజ్ఞాన యాత్రలు దోహదం చేస్తాయన్నారు. రైతులు ఈ విజ్ఞాన యాత్రను సద్వినియోగం చేసుకొని, తమ క్షేత్రాల్లో ఆధునిక పద్ధతులు పాటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, ఆత్మ కమిటీ చైర్మన్ జక్కంపూడి బాలాజీ, ఆత్మ కమిటీ సభ్యులు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

## పి.గన్నవరం సిఐ రుద్రరాజు భీమరాజు సూచన



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈనెల 14వ తేదీన జరగబోయే ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని పి.గన్నవరం సిఐ రుద్రరాజు భీమరాజు సూచించారు. బుధవారం పుల్లేటికుర్రు గ్రామ సచివాలయంలో 13 పాలలకు చెందిన దళిత నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, అంబేద్కర్ జయంతి వేడుకలు గౌరవప్రదంగా జరగాలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డీజే సౌండ్ సిస్టమ్‌లకు అనుమతి లేదని, డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడే వాహనాలను వెంటనే సీజ్ చేస్తామని హెచ్చరించారు. త్రిబుల్ రైడింగ్ పూర్తిగా నిషేధమని తెలిపారు. అలాగే ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వారు కార్యక్రమం ముగిసిన వెంటనే తొలగించాలని సూచించారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే వారిని ఎంతటి వారైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. "చట్టం ముందు అందరూ సమానమే" అని ఆయన అన్నారు. యువత అసభ్య పదజాలం ఉపయోగించి ఇతరులను కించపరచకూడదని హెచ్చరించారు. సైలెన్సర్లు తొలగించి వాహనాలు నడిపితే వెంటనే సీజ్ చేస్తామని తెలిపారు. అంబేద్కర్ జయంతిని ప్రశాంతంగా జరుపుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో అంబాజీపేట ఎస్సై షేక్ సుభాని, తాసిల్దార్ చినబాబు, స్పెషల్ ఆఫీసర్ మమత, పుల్లేటికుర్రు మాజీ సర్పంచ్ జల్లి బాలరాజు, నూకపేయి చిన్న తదితరులు, 13 పాలలకు చెందిన దళిత నాయకులు పాల్గొన్నారు.

# చింతలమోరిలో లిఫ్ట్ ఇరిగేషన్ పథకంపై సమీక్ష



**మలికిపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మలికిపురం మండలం చింతలమోరి ప్రాంతంలో రైతుల ప్రయోజనాల కోసం నిర్మించిన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని పునరుద్ధరించి ప్రయోజనకరంగా మార్చే దిశగా గౌరవ శాసన సభ్యులు శ్రీ దేవ వరప్రసాద్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవా మాట్లాడుతూ ఎస్సీ రైతుల ప్రయోజనాల కోసం రూ.30 కోట్ల వ్యయంతో 3000 ఎకరాల ఆయకట్టు లక్ష్యంగా నిర్మించిన ఈ పథకం ప్రస్తుతం పూర్తిస్థాయిలో ఉపయోగంలో లేకపోవడం వల్ల రైతులకు ప్రయోజనం అందడం లేదన్నారు. అందువల్ల ఈ పథకాన్ని పునరుద్ధరించి రైతులకు ఉపయోగపడే విధంగా మార్పులు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కేశనపల్లి స్కీమ్ ద్వారా కాలువ నుంచి నీటిని తీసుకువచ్చే అవకాశాలను అధికారులు సాంకేతికంగా పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే ఈ పథకం ద్వారా ప్రస్తుతం ఎంతమంది రైతులు లబ్ధి పొందుతున్నారో, ఇంకా ఎవరెవరికి ప్రయోజనం కల్పించవచ్చో పూర్తిగా పరిశీలించాలని ఆదేశించారు. అవసరమైతే పైప్‌లైన్ల ద్వారా నీటిని పంపిణీ చేసి మరింత మంది రైతులకు సాగునీరు అందించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. వర్షాకాలంలో కొన్ని గ్రామాల్లో ఇళ్ల చుట్టూ నీరు నిల్వ ఉండే సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చోట లిఫ్ట్ సదుపాయాలను ఏర్పాటు చేసే అంశాన్ని కూడా పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్షలో నీటి సంఘం చైర్మన్లు, ఇరిగేషన్ శాఖ ఇంజనీర్లు, డ్రైనేజ్ అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సోలార్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్



**రామచంద్రపురం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్ యోజన పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాల మేరకు ఈ పథకం వేగంగా అమలవుతుండగా, ఇందులో భాగంగా బుధవారం మండల పరిధిలోని చోడవరం గ్రామంలో ఇద్దరు లబ్ధిదారుల గృహాలపై 2 కిలోవాట్ల సామర్థ్యం గల రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను కలెక్టర్ మహేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సోలార్ విద్యుత్ వినియోగం ద్వారా విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు ఆర్థికంగా స్వావలంబన సాధించవచ్చని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను వినియోగించుకొని ప్రతి ఇంటా సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, మండల, గ్రామ రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ స్పెషల్ అధికారులు, గ్రామ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యుల సలహాదారుడు ఆదిత్య కిరణ్ మృతి ప్రజలకు తీరని లోటు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** సామాన్య ప్రజల సమస్యలపై ప్రశ్నించే గొంతు శాశ్వతంగా మూగబోయింది ఆయన కలం ఒక బలం,ప్రజల పక్షాన పోరాటం ఆయన నైజం,ఆయన స్పందించిన తీరు సామాన్యుడికి మేలు, అడ్డగోల అధికారులకు అడ్డుగోడ లాంటివాడు. ఆయన ఫిర్యాదుకు జవాబు ఇచ్చి తీరాల్సిందే.- ఎన్నో సమస్యలకు పరిష్కారం,ఎంతోమంది కుటుంబాలకు నైతిక బలం సేవా దృక్పథుడు సామాన్యుల సలహాదారుడు సమస్యలలో కొట్టుమిట్టాడుతున్న సామాన్యులకు నేనున్నాను అనే భరోసా,సమస్యలపై స్పందించే ఆయుధం ఆదిత్య కిరణ్ అక్రమాలకు మోసపోయిన వారికి అన్యాయంగా బలైన వారికి ఆదిత్య కిరణ్ అండగా నిలిచేవారు. ఎంతోమంది సమస్యలను పరిష్కరించారు సామాన్యులను చులకనగా చూసే కొంతమంది అధికారులకు ఫిర్యాదు రూపంలో ప్రశ్నలు సంధించేవారు.ఆయన అడిగే ప్రశ్నలలోనే సమాధానం దొరికేది పరిష్కారం కూడా జరిగేది. అటువంటి ఆదిత్య కిరణ్ మృతి చెందారు.ఆయన లోటును ఎవరూ తీర్చలేరు. ఎందుకంటే ఆయన మేధస్సు అపార నాలెడ్జ్ సబ్జెక్టుపై పూర్తి అవగాహన కలిగి ఉండటం ఆయనకే సొంతం అయితే ఆయన విద్యను ఎప్పుడు దాచుకోలేరు పేద ప్రజలకు అంకితం చేశారు.ఆయన ఎప్పుడు ఒక రూపాయి ఆశించలేదు ఆయనే సొంత ఖర్చులతో సమస్యలను పరిష్కరించేవారు. ఆయన మృతి చెందటం కొత్తపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన భౌతికకాయానికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పుష్ప మాలవేసి నివాళులర్పించారు. చాలా మంచి వ్యక్తి పదిమందికి ఉపయోగపడే మనిషినీ కోల్పోయామని, ఆయన లేని లోటు తీర్చలేనిదని బండారు అన్నారు. గురువుగా మీరందించిన సేవలు చిరస్మరణీయం, మీరు మాతో గడిపిన మధుర క్షణాలను మరువలేము. విషాద వదనంతో నివాళులర్పిస్తూ నీ ఆత్మీయులు బంధువులు స్నేహితులు పుర ప్రజలు అందరూ ఇవే మీకు జోహార్లు.

# కొత్తపేట మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట 33/11కేవి కొత్తపేట పరిదిలో కన్వర్సెడ్ కండక్టర్ రీప్లేస్మెంట్ వర్క్ నిమిత్తం ఆవిడి మైయిన్ విలేజ్, చప్పిడి వారిపాలెం, ఆవిడి పెద్ద పేట, మార్కెట్, కట్లమ్మ గుడి ఏరియా, బ్యాంకు ఏరియా, లింగాల చెరువు, శివాలయం బ్యాక్ సైడ్ ప్రాంతాలకు ఆర్‌డిఎస్ఎస్ వర్కునిమిత్తం గురువారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగును. కావున విద్యుత్ వినియోగదారులు అందరూ సహకరించవలసిందిగా కోరుచున్నామని కె.రాంబాబు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వారు తెలియజేశారు.

విశ్వవాయిస్
అవినీతిపై అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY


కాకినాడ
జిల్లా ఎడిషన్

గురువారం, 09 ఏప్రియల్ 2026
www.viswamvoice.com





# రాష్ట్రంలో ఆర్థిక లోటు ఉన్నా లక్ష్యాలను అధిగమిస్తున్నాం : మంత్రి నారాయణ






**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్థిక లోటు, అవరోధాలను అధిగమించి అభివృద్ధి, సంక్షేమాల సంతులనంతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపించే లక్ష్యంగా 2026-27 సంవత్సర బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టనాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ వివేకానంద హాలులో 2026-27 సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బడ్జెట్ లో పొందుపరచిన ప్రగతి శీల లక్ష్యాలను, ఆర్థిక లోటు తీవ్రంగా ఉన్న అభివృద్ధి, సంక్షేమాలకు ప్రభుత్వం పాటిస్తున్న ప్రాధాన్యతలను, వాటి ద్వారా చేకూరనున్న దీర్ఘకాలిక సుస్థిర ప్రయోజనాలను ప్రజాప్రతినిధులు, అధికారులకు వివరించేందుకు బడ్జెట్ అవుట్ రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్చార్జి మంత్రి నారాయణ ముఖ్యఅతిథిగా హాజరుగా కాగా, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి కొండబాబు, పంతం నానాజీ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వరుపుల సత్యప్రభ, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ, పెందెం దొరబాబులు విశిష్ట అతిధులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ అవుట్ రీచ్ కార్యక్రమం లక్ష్యాన్ని వివరించి 2026-27 రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ లోని కీలకమైన అంశాలను విశ్లేషణాత్మంగా ప్రజాప్రతి నిధులకు, అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర విభజనతో పరిశ్రమ, సేవారంగాల ఆర్థిక వనరులు కోల్పోయి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వ్యవసాయ ప్రధాన ఆర్థిక వ్యవస్థగా మారిందని, అందువల్ల రాష్ట్ర ఆదాయంతో పాటు, రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం కూడా మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే చాల తగ్గిపోయిందన్నారు. ఈ ఆర్థిక లోటు గత ప్రభుత్వ అసమర్థ ఆర్థిక విధానాలతో ఈ ఆదాయ లోటు మరింత జటిలంగా మారిందన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను తీరుస్తూ, అభివృద్ధి, సంక్షేమాలకు లోటు లేకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు తమ ప్రభుత్వం శ్రమిస్తోందన్నారు. ప్రతికూల పరిస్థితుల నుండి బయట పడి రాష్ట్రాన్ని మరల అభివృద్ధి పథంలోకి తెచ్చే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రగతి శీల ఆర్థిక విధానాలు, బడ్జెట్ లక్ష్యాలను ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు వివరించాలని మంత్రి పి నారాయణ కోరారు. అలాగే అమరావతిని రాష్ట్ర ఏకైక శాశ్వత రాజధానిగా పార్లమెంట్ బిల్లు పాస్ చేసినందుకు సమావేశం పీఎం నరేంద్రమోడీ, సీఎం చంద్రబాబులకు ధన్యవాదాలు తెలిజేస్తూ తీర్మానం చేసింది. అనంతరం ఈ సమావేశంలో చర్చించిన అంశాలను కలెక్టరేట్ పిఆర్జీఎస్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి నారాయణ మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా 16 వేల కోట్ల అప్పులు మిగిల్చి పోయిన గత ప్రభుత్వ నిర్వాకాలను రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతమైన ఆర్థిక విధానలతో చక్కదిద్దుతోందనని తెలిపారు. ఆదాయ వనరులు తక్కువగా ఉన్నా సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని సూపర్ సిక్స్ ప్రాధాన్యతలుగా గణనీయంగా పింఛన్ మెత్తం పెంపుదల, స్త్రీ శక్తి, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, దీపం 2.0 తో పలు సంక్షేమ కార్యాక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రో ఇండస్ట్రీ విధానల ద్వారహా గత 20 నెలలో కాలంలో 9.68 లక్షల కోట్ల విలువైన 1.19 లక్షల పెట్టుబడతో రాష్ట్రంలో 5.41 లక్షల మంది ఉపాధి జనరేట్ చేసిందన్నారు. గ్లోబల్ పార్టర్షిప్ సమ్మిట్లో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న 610 ఎంఓయూల ద్వారా ప్రాంతీయ సంతులనంతో 13.25 లక్షల కోట్ల పెట్టుబడులతో 16.13 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించే పరిశ్రమలు వస్తున్నాయన్నారు. అలాగే చిన్న, మద్య తరహా పరిశ్రమలకు 1600 కోట్లు ప్రోత్సాహలు కల్పించడం జరిగిందన్నారు. 15 బిలియన్ పెట్టుబడితో విశాఖపట్నంలో ఏర్పాటౌతున్న గూగల్ డేటా సెంటర్ రాష్ట్ర ప్రగతిలో మైలు రాయి కానుందన్నరు. శరవేగంగా సాగుతున్న రాష్ట్ర ప్రగతిని చూసి ఓర్వలేక కొందరు చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలు విశ్వసించరన్నారు. సమర్థ ఆర్థిక విధానాలతో కొనసాగున్న రాష్ట్ర ప్రగతిని, వాస్తవాలను ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు వివరించేందుకు బడ్జెట్ అవుట్ రిచ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ డి.తిప్పే నాయక్, సిపిఓ పి.త్రినాథ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్ర చేయబోయే ఆమరణ దీక్షకు మద్దతుగా

# ఏలేశ్వరంలో గొంప శివ రిలే దీక్ష



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్ బీసీ సింహగర్జన సభలో కూటమి ప్రభుత్వానికి ఐదు డిమాండ్లను డిమాండ్ చేసిన సందర్భంగా వాటిని నెరవేర్చకపోతే ఈ నెల 11న ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని చెప్పడం జరిగింది.ఆ ఆమరణ నిరాహార దీక్షకు మద్దతుగా, బోడె రామచంద్ర యాదవ్ ఆదేశాల మేరకు, బీసీవై పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ గొంప శివకుమార్ యాదవ్ ఈరోజు ఏలేశ్వరం పట్టణంలో స్థానిక బస్ స్టేషన్ ప్రక్కన రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ, బీసీలే వెన్నుముక, బీసీలు లేకపోతే తెలుగుదేశం పార్టీ లేదు అని, తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలంతా బీసీ వర్గానికి చెందిన వారిని ఎప్పుడు ప్రగల్బాలు పలికే కూటమి ప్రభుత్వం, బీసీల అభ్యున్నతి కొరకు , బీసీల రక్షణ కొరకు, బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్ర యాదవ్ చేసిన డిమాండ్ చేసిన ఐదు డిమాండ్లను నెరవేర్చకపోగా కనీసం స్పందన కూడా తెలియజేయలేదని, ఇదేనా వారికి బీసీలపై ఉన్న కూటమి ప్రభుత్వం బీసీల పట్ల ఇదే విధానం కొనసాగిస్తే బీసీల యొక్క ఆగ్రహానికి కచ్చితంగా గురవుతారని బీసీలు తలచుకుంటే ప్రభుత్వాలు కుప్ప కూలిపోతాయనీ ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో, గొంప శివ కుమార్ తో పాటు శ్రీరామవరం మాజీ సర్పంచ్ దేవర శ్రీను, ఏగుపాటి అర్జున్ రావు, సానబోయిన ఆది బాబు, పల్ల గంగ బాబు, బొడ్డు అనిల్ కుమార్, గొంప శివ, శరణం హరీష్, వమ్మి సురేంద్ర, మానబాల నాని, కోర్ని ప్రసాద్, పి.అప్పయ్యమ్మ, ఎం.చిలకమ్మ, కె.దయామణి తదితరులు పాల్గొన్నారు.

# సర్పవరంలో సీసీ రోడ్లు ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే నానాజీ



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** బుధవారం సర్పవరం గ్రామంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులతో పోస్టల్ కాలనీ, భవన్ నారాయణపురంలలో 9 సీసీ రోడ్లు, ఒక డ్రెన్ ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలతో ప్రతి గ్రామంలోనూ సుమారు100 కోట్లు నిధులతో సీసీ రోడ్లను డ్రైనేజీలను వేయడం జరిగిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎండిఓ సతీష్, కూటమి నాయకులు పెంకె శ్రీనివాస్ బాబా, రంబాల వెంకటేశ్వరరావు,పుల్ల శ్రీరాములు, పుల్లా వీరబాబు, పుల్ల కోటేశ్వరరావు, నందిపాటి త్రిమూర్తులు, బన్ను, బోళ్ళ కృష్ణమోహన్, పాంద్రంకి రాజు, కార్యదర్శి పబ్బినేడిశ్రీనివాసరావు, నూకలనారాయణరావు, బసవచంటి ,బసవ సూరిబాబు, అద్దంకివీరబాబు,ముసలయ్య,అధికారులు కూటమి నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పండూరు పీహెచ్సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం పండూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అకస్మకంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రజలకు అందుతున్న వైద్య సదుపాయాలు, అందుబాటులో ఉన్న వైద్యాధికారులు, ఆపరేషన్ థియేటర్, లేబర్ రూమ్, ఇన్ పేషెంట్, అవుట్ పేషెంట్ వివరాలు మెడికల్ అధికారిణిని అడిగి తెలుసుకున్నారు. వైద్య సదుపాయం నిమిత్తం పీహెచ్సీకి వచ్చిన ప్రజలతో మాట్లాడి వారు పొందిన వైద్య సేవలు వివరాలను ఆరా తీశారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా మలేరియా అధికారి డా. ఐ.ప్రభాకర్, పండూరు వైద్య అధికారి డాక్టర్ కె.మాధవి ఇతర ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఉన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో మిస్సింగ్ కేసును

# రెండు గంటల్లోనే ఛేదించిన టూ టౌన్ పోలీసులు

## బాధితురాలు సురక్షితం



**కాకినాడ క్రైమ్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ఐపీఎస్ వారి ఆదేశాల మేరకు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఒక మిస్సింగ్ కేసును కాకినాడ టూ టౌన్ పోలీసులు కేవలం రెండు గంటల వ్యవధిలోనే ఛేదించారు. కాకినాడ శారదాదేవి గుడి సమీపంలోని కనకమహాలక్ష్మి గుడి వీధికి చెందిన ర్యాలి విజయదుర్గ (27), కుటుంబ కలహాల కారణంగా బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు ఇంటి నుండి బయటకు వెళ్లిపోయారు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో, ఉదయం 9 గంటలకు ఆమె భర్త రాంకిశోర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

**సాంకేతిక పరిజ్ఞానంతో వేగవంతమైన గుర్తింపు....**

ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం.అప్పలనాయుడు, ఎస్పీ సూచనల మేరకు ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దించారు. సాంకేతిక పరిజ్ఞానం, సిబ్బంది సమన్వయంతో బాధితురాలు ఎక్కడ ఉన్నారో కేవలం 2 గంటల్లోనే గుర్తించి, ఆమెను సురక్షితంగా రక్షించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.తమ ఫిర్యాదుపై తక్షణమే స్పందించి బాధితురాలిని అప్పగించినందుకు ఆమె కుటుంబ సభ్యులు జిల్లా ఎస్పీ గారికి మరియు టూ టౌన్ పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కేసులో చురుగ్గా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడును మరియు సిబ్బందిని కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్, ఐపీఎస్, ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

అంగన్వాడీ సెంటర్‌ను, జిల్లా పరిషత్ పాఠశాలను పరిశీలించిన

# జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్



**పిఠాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ బుధవారం పిఠాపురం మండలం పర్యటనలో భాగంగా పాడా పీడీ శివ రామ్ ప్రసాద్, ఎంపీడీవో స్వప్న ఇతర అధికారులతో కలిసి జల్లూరు లోని అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. చిన్నారులతో ముచ్చటించి వారి అభ్యసించిన కృత్యాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి కేంద్రంలోని కిచెన్, స్టోర్ రూమ్ ను పరిశీలించి సరుకుల వివరాలు, నాణ్యత అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అంగన్వాడీ సిబ్బందికి సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుమారపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇతర సిబ్బందితో మాట్లాడి విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు, తాగునీరు ఇతర సదుపాయాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సజావుగా పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు.

ఎండల తీవ్రత జాగ్రత్తలపై

# సోషల్ మీడియా హెచ్చరికలు...!




**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏప్రిల్ 19 నుండి మే 31 వరకూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎవరూ బయటకు (ప్రత్యేకంగా బహిరంగ ప్రదేశాలకు) వెళ్లకూడదు. ఎందుకంటే ఉష్ణోగ్రత 45శీసి నుండి 55శీసి వరకు పెరగవచ్చని వాతావరణ శాఖ తెలిపింది. ఈ సమయంలో భూమి మీద నేరుగా 70% అతినీలలోహిత సూర్య కిరణాలు ప్రసరిస్తాయి. ఎవరికైనా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా అకస్మాత్తుగా అస్వస్థత కలిగితే వెంటనే డాక్టర్‌ను సంప్రదించండి. గాలి సరిగా వచ్చేలా గదుల తలుపులు తెరిచి ఉంచండి. మొబైల్ వినియోగాన్ని తగ్గించండి, అధిక వేడి కారణంగా మొబైల్ పేలే ప్రమాదం ఉంది. జాగ్రత్తగా ఉండండి అంటూ సామాజిక మాధ్యమాల్లో హెచ్చరికలు హల్ చల్ చేస్తున్నాయి. అలాగే ఎండల తీవ్రతకు ఉపశమన మార్గాలను కూడా పౌర రక్షణ విభాగం నుంచి చెబుతున్నారు. పెరుగు, మజ్జిగ, నిమ్మ రసం వంటి చల్లని పానీయాలను ఎక్కువగా తీసుకోండి. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు 47శీసి నుండి 55శీసి వరకు పెరుగుతాయి. కొన్ని ప్రాంతాల్లో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలిగించే వేడి గాలులు వీచే అవకాశం ఉంది. గ్యాస్ పదార్థాలు, లైటర్లు, కార్బోనేటెడ్ పానీయాలు, సుగంధ ద్రవ్యాలు, బ్యాటరీలను కార్లలో ఉంచ కూడదని సూచిస్తున్నారు. గాలి ప్రసరణ కోసం కారు కిటికీలు కొద్దిగా తెరిచి ఉంచాలని, కారు ఇంధన ట్యాంక్‌ను పూర్తిగా నింపొద్దని, సాయంత్రం సమయంలో మాత్రమే కారులో ఇంధనాన్ని నింపాలని, ఉదయం సమయాల్లో కారులో ప్రయాణించొద్దని, ప్రయాణ సమయంలో టైర్లలో అధిక గాలిని నింపొద్దని సూచిస్తున్నారు. తేళ్లు, పాములు చల్లని ప్రదేశాల కోసం ఇళ్లలోకి రావచ్చు. కాబట్టి జాగ్రత్తగా ఉండండి. ఎక్కువగా నీరు, ద్రవాలు తాగండి. గ్యాస్ సిలిండర్‌ను ఎండలో ఉంచవద్దు. విద్యుత్తు మీటర్లపై అధిక లోడ్ వేయవద్దు. అవసరమైన గదుల్లో మాత్రమే ఎయిర్ కండిషనర్ ఉపయోగించండి. ప్రతి 2-3 గంటలకు కనీసం 30 నిమిషాలు విశ్రాంతి తీసుకోండి. బయట ఉష్ణోగ్రత 45-47 ఉన్నప్పుడు ఇంట్లో ఏసిని 24-25 వద్ద ఉంచండి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నేరుగా సూర్యకాంతిని తప్పించండి అంటూ సోషల్ మీడియా కోడై కూస్తోంది. ఐతే ఈ ప్రచారాన్ని ప్రభుత్వ యంత్రాంగాలు ఏవీ కూడా ప్రభుత్వ అధికారిక హెచ్చరికలు కాదని ధృవీకరిస్తూనే, ప్రభుత్వం త్వరలో ప్రకటించే అవకాశం లేకపోలేదని వివరణ ఇస్తున్నాయి.

విద్యతో నైతిక విలువలు ఉంటేనే ఉన్నత స్థాయికి

# ప్రత్తిపాడు సిఐ. బి.సూర్యఅప్పారావు



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉన్నత స్థాయికి ఎదిగేందుకు విద్యతో పాటు నైతిక విలువలు ఉంటేనే విద్యార్థులు ఉన్నత స్థానానికి ఎదుగుతారని ప్రత్తిపాడు పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.సూర్యఅప్పారావు పేర్కొన్నారు. ప్రస్తుతం పిల్లలపై సోషల్ మీడియా ప్రభావం పడుతోంది. వాటి కారణంగా వారి ప్రవర్తనలో మార్పు వచ్చే అవకాశం ఉంది. అందుకే పాఠశాల స్థాయిలోనే నైతిక విలువల పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన వివరించారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని మండల కేంద్రం శంఖవరంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ, జూనియర్ కళాశాల విద్యార్థినిలకు విద్యార్థుల్లో నైతిక విలువల అంశంపై బుధవారం సాయంత్రం ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు నైతిక విలువల పాటించాను ఆవశ్యకత, విద్యార్థులు పాటించాల్సిన సామాజిక బాధ్యతలు వంటి పలు అంశాలపై సిఐ వివరించారు. ఒకప్పుడు అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్య పిల్లలకు నీతి, నిజాయతీ, సేవ, విలువల గురించి కథల రూపంలో చెప్పేవారు. కుటుంబాలు తగ్గిపోయాయి. అందువల్ల ప్రస్తుతం అలాంటి పరిస్థితి అన్ని చోట్ల లేదు. ఉద్యోగ, వ్యాపారాలు, అవసరాల రీత్యా వివిధ ప్రాంతాల్లో తల్లిదండ్రులు, విద్యార్థులు వసతి గృహాలు, బడుల్లో వేర్వేరుగా ఉంటున్నారు. భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేయడం, పని ఒత్తిడి ఇతర కారణాల వల్ల పిల్లలకు సమయం కేటాయించలేక పోతున్నారు. ఫలితంగా బాల బాలికలు సోషల్ మీడియా, టీవీలకే పరిమితం అవుతున్నారు. నైతిక విలువలు తగ్గిపోతున్నాయి. కోపం, ఆందోళన, అశాంతి నెలకొంటోంది. అందుకే పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు నైతిక విలువలు నేర్పించాలని సీఎం చంద్రబాబు భావించారు. అందువల్ల విద్యార్థుల్లో విలువల విద్య బోధనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, అందుకే విలువల విద్య పుస్తకాలను మీకు ప్రభుత్వం పంపిణీ చేసిందని ఆయన గుర్తు చేశారు. మీకు కావలిసిన అన్ని సదుపాయాలనూ ప్రభుత్వం కల్పిస్తోంది. మీరు వాటిని వినియోగించుకొని బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని, సెల్ ఫోన్లకు, దూరంగా ఉండాలని తెలిపారు. మీ ఊరిలో గాని బయట గాని ఏమైనా సమస్యలు ఎదుర్కొన్నట్లయితే మీ ఉపాధ్యాయులు దృష్టికి లేదా మా దృష్టికి ధైర్యంగా తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట అన్నవరం పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ జి.శ్రీహరిబాబు, కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బీరా బాలామణి కుమారి, నర్సు కానేటి మేరీ తదితరులు ఉన్నారు.

# ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామం సెలపాక జంక్షన్ సమీపంలో బుధవారం ప్రైవేట్ ట్రావెల్ బస్సు డీ కొని కరప మండలం గొర్రిపూడికి చెందిన వ్యక్తి దుర్మరణం చెందాడు. స్థానికులు, గొల్లపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరప మండలం గొర్రిపూడి గ్రామానికి చెందిన గండి ఏసురత్నం మోటారు సైకిళ్లపై ఊరూరా తిరుగుతూ కూరగాయల వ్యాపారం చేస్తూ జీవనం గడిపేవాడు. ఎప్పటిలానే బుదవారం ఉదయం తన మోటారు సైకిల్ పై కూరగాయలు అమ్మకానికి తీసుకు వెళ్ళుతుండగా హైద్రాబాదు నుంచి వస్తున్న ప్రయివేటు ట్రావెల్ కు చెందిన బస్సు వేగంగా వచ్చి అతన్ని డీ కొట్టింది. ఈ సంఘటనలో ఏసురత్నంకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు గమనించి వెంటనే 108 అంబులెన్సులో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న గొల్లపాలెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్ ని అదుపులోనికి తీసుకుని, ట్రావెల్ బస్సును పోలీస్టేషన్ కు తరలించారు. గాయాల పాలైన ఏసురత్నం బుధవారం సాయంత్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏసురత్నంకు భార్య ఒక కుమారుడు. కుమార్తె ఉన్నారు. ఏసురత్నం మృతితో అతని కుటుంబం రోడ్డున పడింది. పోలీసులు తరచూ తనిఖీలు నిర్వహించి అతివేగం ప్రమాదకరమని డ్రైవర్లకు ఎన్ని కౌన్సిలింగ్ లు ఇచ్చినా డ్రైవర్లు నిర్లక్ష్యం వీడటం లేదు ప్రాణం విలువ తెలుసుకుని డ్రైవర్లు ప్రవర్తించాలని స్థానికులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

తండ్రి జ్ఞాపకార్థం వైసీపీ నేత బదిరెడ్డి గోవిందు కైలాస ధామంనకు

# ఫ్రీజర్ బాక్స్ వితరణ

## ప్రత్తిపాడు వైసిపి ఇన్చార్జ్ ముద్రగడ గిరి చేతుల మీదుగా అప్పగింత



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రత్తిపాడు నియోజకవర్గం, ఏలేశ్వరం పట్టణంలో, స్థానిక కైలాస ధామం (స్మశాన వాటిక) నకు తన తండ్రి స్వర్గీయ బదిరెడ్డి వెంకన్న దొర పేరిట, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మరియు ఏలేశ్వరం నగర పంచాయతీలోని మూడో వార్డు కౌన్సిలర్ అయిన బదిరెడ్డి గోవిందు వితరణ చేశారు. ఈ వితరణ కార్యక్రమాన్ని ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు చేతిలో మీదుగా జరిపించడం విశేషం. ఈ సందర్భంగా బదిరెడ్డి గోవింద్ మాట్లాడుతూ, ఏలేశ్వరం నగర పంచాయతీలో మరణించిన వారి పార్థివ దేహాన్ని, వేరే గ్రామాల నుంచి లేదా రాష్ట్రాల నుంచి వచ్చే బంధువుల సందర్శనార్థం ఇంటి వద్ద ఉంచుకోవడానికి ఫ్రీజర్ బాక్స్ ఎంతో ముఖ్యమని, ఆ సౌకర్యం ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎక్కడా లేకపోవడం, దానిని తెప్పించుకోవాలంటే కాకినాడ రాజమండ్రి సామర్లకోట ఇలాంటి ఊర్లో నుంచి తెప్పించుకోవాలని అయినప్పటికీ అవి ఖాళీ ఉంటే దొరుకుతాయి లేదంటే దొరకవని, ఇటువంటి పరిస్థితుల్లో వాసవి క్లబ్ వారు తనను సంప్రదించారని, దాంతో తమ కుటుంబ సభ్యులంతా కలిసి తమ తండ్రిగారైన బదిరెడ్డి వెంకన్న దొర గారి పేరిట వితరణ చేస్తున్నామని, అంతేకాకుండా ఏలేశ్వరంలో మరో పెద్ద సమస్య ఉందని, అదేమిటంటే ఏలేశ్వరంలో పోస్టుమార్టం సౌలభ్యం లేదని, అందువలన ప్రత్తిపాడు హాస్పిటల్ కి తరలించి అక్కడ పోస్మార్టం కావించి రిపోర్టు తీసుకోవడం కొరకు వేచి చూడాల్సి వస్తుందని దాతలు ఎవరైనా ఉంటే ఏలేశ్వరం గవర్నమెంట్ హాస్పిటల్ లోనే గదులు నిర్మించి, పోస్ట్ మార్టం సౌకర్యం కల్పించడానికి అవకాశం ఉంటుందని, అవకాశం ఉన్న దాతలు ముందుకు రావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు వైసిపి ఇన్చార్జ్ ముద్రగడగిరి బాబు, పైలా అబ్బు, గొల్లపల్లి కాశి, జువ్విన వీర్రాజు, సామంతుల సూర్య కుమార్, కోరాడ ప్రసాద్, బదిరెడ్డి శ్రీను, రాచర్ల రమేష్, సిరి పురపు రాజేష్, 8ఋ వార్డు కౌన్సిలర్ దేగల రమణ, చంద్ర మౌళి, వాసవి క్లబ్ సభ్యులు ప్రగళ్లపాటి కామేష్, పిరాట్ల సాయి, మరియు వైసిపి నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానుల తో పాటు కైలాస గ్రామం మెయింటైనర్ ఆకుల గంగరాజు పాల్గొన్నారు.





# పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

## 46వ డివిజన్‌లో ఆకస్మిక పర్యటనలో - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నగర పాలక సంస్థ ఆరోగ్య విభాగం అధికారులు, సిబ్బందికి రాజమహేంద్రరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచించారు. స్థానిక 46వ డివిజన్‌లోని రామదాసుపేట, వెంకటాపురం, చిట్టి సంజీవనగర్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేయడం లేదని ఫిర్యాదులు రావడంతో ఆయా ప్రాంతాల్లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్థానిక నాయకులు, నగర పాలక సంస్థ ఆరోగ్య విభాగం అధికారులతో కలిసి ఆకస్మికంగా పర్యటించారు. అధికారులతో కలిసి పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "మన నగరం... మన ప్రాంతాన్ని శుభ్రంగా, అందంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు ఒక రోజు లేదా ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితం కాకుండా, సరైన ప్లానింగ్‌తో అన్ని కాలనీల్లో రోటేషన్ విధానంలో నిర్వహించాలని, ప్రతి వారానికి ఒక రోజు ప్రత్యేకంగా గ్యాంగ్ వర్క్ ఏర్పాటు చేసి, చిట్టి సంజీవనగర్, రామదాసు కాలనీ, వెంకటాపురం వంటి ప్రాంతాల్లో క్రమంగా శుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజలు ఎక్కువగా రాకపోకలు చేసే ప్రదేశాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కళాకారులు, యువతను కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసి, వారానికి ఒకసారి అవగాహన కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తే ప్రజల్లో మంచి స్పందన వస్తుందన్నారు. ప్రతి వారం అధికారులు, సిబ్బంది పనితీరును సమీక్షించాలన్నారు. మంచి పని చేసిన వారిని ప్రోత్సహించి, అవార్డులు ఇవ్వడం ద్వారా పారిశుద్ధ్య సిబ్బంది మరింత ఉత్సాహంగా పని చేస్తారన్నారు. స్థానిక నాయకులు, అధికారులు పరస్పరం సమన్వయం చేసుకుని, ప్రజల సహకారంతో పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా జరిగేలా చూడాలని, అవసరమైతే కమిషనర్ తో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను చర్చించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక నాయకులు, అధికారులు, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

# అర్హులందరికీ టిడ్కో ఇల్లు కేటాయిస్తాం

## వర్షాకాలం నాటికి మెయిన్ డ్రైనేజీ నిర్మాణాలు పూర్తి చేస్తాం - నగర వార్డుల్లో ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలన్న ఎమ్మెల్యే గోరంట్ల

**రాజమహేంద్రవరం రూరల్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఇళ్లు లేని అర్హులందరికీ త్వరలోనే టిడ్కో ఇళ్లు కేటాయిస్తామని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. బుధవారం ఉదయం గోరంట్ల వారి కార్యా లయం నందు మున్సిపల్ మరియు రెవెన్యూ అధికారులతో పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఆ సందర్భంగాడి.బ్లాక్‌లో నివాసముంటున్న ఒరియా పేట, టవర్ లైన్ వారికి టిడ్కో ఇళ్లు కేటాయించాలని అలాగే రాజమండ్రి నుండి ధవలేశ్వరం సాయిబాబా ఆలయం వద్ద పంపు హౌస్ కు మురుగునీరు చేరుకునే కాలువపై అనేక ఆక్రమణలు ఉన్నాయని, సర్వే చేసి



వాటన్నిటిని తొలగించాలని వాటిలో అర్హులైన వారందరికీ టిట్కోలో ఇల్లు కేటాయించాలని తెలిపారు. వర్షాకాలం వచ్చేనాటికి కోటిపల్లి బస్టాండ్ నుండి ధవలేశ్వరం వరకు మెయిన్ డ్రైనేజీ నిర్మించాల్సి ఉందని, రైల్వే శాఖ వారితో అనుసంధానం చేసుకుంటూ త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నగర వార్డుల్లో అనేకచోట్ల ఆక్రమణలను ప్రోత్సహిస్తున్నారని, వాటి వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ఇబ్బందులు పడుతున్నారని, ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకొని ట్రాఫిక్కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ పీ.వీ రామలింగేశ్వరరావు, ఎమ్మార్వో శ్రీనివాస్, మరియు పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

### 11న పూలే జయంతి సందర్భంగా

# సామాజిక విప్లవం పేరిట రాష్ట్ర స్థాయి సదస్సు



## ప్రధాన వక్తగా బి.పి.మండల్ యాదవ్ మనుమడు ప్రొఫెసర్ సూరజ్ యాదవ్ రాక పూలే సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు నయనాల కృష్ణారావు వెల్లడి

**రాజమహేంద్రంవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆధునిక భారత జాతిపిత జోతిబా పూలే ద్విశతదినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈనెల 11 వ తేదీన సామాజిక విప్లవం పేరిట రాజమండ్రిలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు పూలే సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు నయనాల కృష్ణారావు చెప్పారు.ఆరోజు సాయంత్రం 4 గంటలకు గోదావరి గట్టున ఉన్న పూలే-ఆంబేద్కర్ భవన్ లో జరగనున్న ఈ సదస్సులో ప్రధాన వక్తగా బీసీ రిజర్వేషన్ల సిఫారసు యోధుడు బి.పి.మండల్ యాదవ్ మనుమడు ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరజ్ యాదవ్ హాజరుకానున్నారని ఆయన తెలిపారు.బుధవారం ఉదయం పూలే ఆంబేద్కర్ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నయనాల కృష్ణారావు మాట్లాడుతూ ఆ రోజున మూడు అంశాలపై ముగ్గురు ప్రముఖులు ప్రసంగిస్తారని చెప్పారు.భారత దేశంలో సామాజిక విప్లవం అంశంపై ప్రొఫెసర్ సూరజ్ యాదవ్,పూలే సిద్ధాంతం -వర్తమాన పరిస్థితులకు అన్వయింపు అంశంపై తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బి.ఎస్.రాములు,కులం-దాని నిర్మాణం - కూల్చివేత అంశంపై సీనియర్ జర్నలిస్టు మలసాని శ్రీనివాస్ ప్రసంగిస్తారని ఆయన వివరించారు.సుమారు 500 మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. ముఖ్య అతిథిగా రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ( వాసు)హాజరవుతారని చెప్పారు.సదస్సు అనంతరం వివిధ రంగాల్లో ప్రముఖులకు అభినందన సత్కారం చేస్తామని ఆయన చెప్పారు.ఇది పూలే 199 వ జయంతి వేడుక అని ఇప్పటి నుంచి ఏడాదిపాటు పూలే ద్విశతదినోత్సవ వేడుకలకను ఆంధ్రప్రదేశ్ లోని ఉమ్మడి 8 జిల్లాల్లో నిర్వహిస్తామని నయనాల కృష్ణారావు వివరించారు.వార్డు, గ్రామ,మండల స్థాయిలో సదస్సులు,పూలే ఆంబేద్కర్ సాహిత్యంపై ప్రచారం చేస్తామని ఆయన తెలిపారు.నెలకు ఒకసారి పూలే ఆంబేద్కర్ భవన్ లో సమావేశాలు జరుపుతామని నయనాల కృష్ణారావు చెప్పారు. విలేకరుల సమావేశంలో మాజీ కార్పొరేటర్ మొకమాటి సత్యనారాయణ,బొట్టా వీరబాబు,బుడ్డిగ రవి,పుచ్చల రామకృష్ణ,బుడ్డిగ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

# అమలాపురం తరలిన మండపేట వైసీపీ నాయకులు



## ఏబీఎన్ అభ్యంతరకరమైన రాతలపై నిరసన

**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ మహిళలపై ఏబీఎన్ రాతలు అభ్యంతరకరంగా ఉన్నాయని ఆరోపిస్తూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైసీపీ నేతలు అమలాపురం గడియార స్తంభం సెంటర్ వద్ద ఆందోళనకు దిగారు. పార్టీ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కోనసీమ జిల్లా కేడర్ తో పాటు మండపేట నియోజకవర్గ వైసీపీ నేతలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. సభ్య సమాజం సిగ్గుపడేలా ఏబీఎన్ రాధాకృష్ణ రాతలు ఉన్నాయంటూ వైసీపీ నేతలు మండిపడ్డారు. తక్షణమే ఈ రాతలకు క్షమాపణ చెప్పాలనీ డిమాండ్ చేశారు. సమస్యను జాతీయ మహిళా కమిషన్, జాతీయ ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా జిల్లా ఎస్పీకి పిర్యాదు చేసేందుకు వెళ్తున్న వీరిని పోలీస్ కు అడ్డుకోవడంతో స్వల్ప తోపులాటలు చోటు చేసుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైసీపీ యువనేత తోట పృధ్విరాజ్,రామచంద్రపురం నియోజవర్గ వైసీపీ ఇన్చార్జ్ పిల్లి సూర్య ప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రగుంట అయ్యప్ప, నియోజవర్గ ఆర్టిఐ విభాగ అధ్యక్షులు మందపల్లి రవికుమార్, తణుకు అశోక్,జిల్లా యువజన విభాగ కార్యదర్శి కోణాల సుభాష్ చంద్రబోస్, జిల్లా కార్యదర్శి టేకుమూడి శ్రీనివాస్, ఎర్రగుంట అయ్యప్ప,తదితరులు పాల్గొన్నారు

# కోటిలో అకిరా ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం : ఎంపీటీసీ గట్టి



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని కోటి గ్రామంలో ఎంపీటీసీ గట్టి వీరప్రసాద్ ఆధ్వర్యంలో అకిరా కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు ప్రసాద్ తెలిపారు. బుధవారం కోటి అంగన్వాడి కేంద్రంలో అకిరా కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి కోటి, నల్లగొండ, శ్రీరంగపట్నం తదితర గ్రామాల నుండి ప్రజలు విచ్చేసి, ఉచిత కంటి పరీక్షలు చేయించుకోన్నారు. అవసరమైన వారికి తక్కువ ధరకు కళ్ళజోళ్ళు విక్రయించినట్లు కంటి వైద్యులు డాక్టర్ రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అకిరా కంటి వైద్యులు డాక్టర్ రమేష్, మాజీ సర్పంచ్ వెంటపాటి దుర్గారావు, ఎంపీటీసీ గట్టి వీరప్రసాద్, జనసేన పార్టీ నాయకులు అడ్డాల శ్రీను, తన్నీరు తాతాజీ, ముక్క రాంబాబు, కర్రి గణేష్, చదువు ముక్తేశ్వరరావు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అర్తమూరులో తెలుగుదేశం పార్టీ గ్రామస్థాయి సమావేశం



**మండపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట మండలం అర్తమూరు గ్రామంలో బుధవారం గ్రామ పార్టీ అధ్యక్షులు చిర్ల వెంకటరెడ్డి అధ్యక్షతన పార్టీ గ్రామస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి గత ప్రభుత్వాల పనితీరుపై చర్చలు జరిపారు. అదేవిధంగా పెన్షన్ల పంపిణీలో గత ప్రభుత్వ హయాంలో 5 సంవత్సరాల కాలానికి గాను 13,90,30,250 రూపాయలు పంపిణీ చేయగా, ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం కేవలం 23 నెలల కాలంలోనే 10,22,60,000 కోట్ల రూపాయల పెన్షన్లను లబ్ధిదారులకు అందించిందని గుర్తు చేశారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి గ్రామంలో ప్రస్తుతం జరుగుతున్న అంతర్గత సిమెంట్ రోడ్ల పనుల పురోగతిని సమీక్షించారు. మిగిలిన రోడ్ల నిర్మాణాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి అర్తమూరు గ్రామానికి సంబంధించి ఇప్పటివరకు 8,48,571 రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. ఇందులో భాగంగా గూడపూడి వెంకట సత్య కృష్ణ శివరాం వైద్య చికిత్స నిమిత్తం 25,295 రూపాయల చెక్కును అందజేశారు. మొత్తంగా గ్రామానికి 8,73,866 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందినట్లు వివరించారు. ఈ అంశాలన్నీ సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించారు.చివరగా పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నల్లమిల్లివీర్రెడ్డి పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో చిర్ల రామన్న, పడాల రాము, కర్రి సత్యనారాయణ రెడ్డి, చిర్ల ఆదిరెడ్డి, చిర్ల చంద్ర రెడ్డి, తాడి బొజ్జి రెడ్డి , పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆవ భూములలో ఎటువంటి పంటలు లేవు : తహసిల్దార్ సుగుణ

## - మొక్కజొన్నకు అన్ని పత్రాలు ఉన్నాయి



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలంలోని బూరుగుపూడి ప్రభుత్వ ఆవ భూములలో ప్రస్తుత ఎటువంటి పంటలు లేవని తహసిల్దార్ సుగుణ తెలిపారు. ఇటీవల రాజానగరం శాసనసభ్యులు బలరామకృష్ణ తన కార్యాలయానికి వచ్చి ప్రభుత్వం సేకరించిన ఆవ భూమిలో సుమారు 300 ఎకరాల్లో 30 మంది రైతుల అక్రమంగా మొక్కజొన్న సాగు చేస్తున్నారని, పోలీసుల సహకారంతో పంటను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని తెలిపారన్నారు. బుధవారం తన కార్యాలయంలో సుగుణ పాత్రికేయులతో మాట్లాడుతూ శాసనసభ్యులు ఆదేశాలతో ప్రభుత్వ ఉన్నతఅధికారుల సూచన మేరకు ఆవ భూములలో రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సహకారంతో రంగ ప్రవేశం చేశామని, అయితే ఎక్కడ ఏ విధమైన పంటలు తమ కంటపడలేదన్నారు. అయితే కనకరాజు అనే వ్యక్తి సుమారు మూడువేల మొక్కజొన్న మూటలను ఆరబెట్టుకుంటున్నారని, ప్రభుత్వ అధికారుల ఆదేశాలతో వాటిని స్వాధీనం చేసుకున్నమని, సరైన బిల్లులు చూపడంతో సంబంధిత అధికారుల సూచన మేరకు సరుకు ఆయనకు అప్పగించడం జరిగిందన్నారు. సుమారు 80 ఎకరాల ప్రభుత్వ ఆవ భూమిలో యూవ కలిప్టస్ మొక్కలు ఉన్నాయన్నారు. ఇకమీదట ప్రభుత్వానికి సంబంధించిన 360 ఎకరాలకు ఎటువంటి పంటలు వేసిన ప్రభుత్వపరంగా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామిరెడ్డి పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే రౌతు గృహ నిర్బంధం

## ఎ.బి.ఎన్.రాధాకృష్ణను అరెస్టు చేయాలి



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఎబిఎన్-ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ వై ఎస్ ఆర్ పార్టీ నాయకులు, మహిళలపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై నేడు వైఎస్ఆర్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమంచేపట్టారు. ఈ సందర్భంగా నగరంలోపార్టీ నాయకులను బయటికి రాకుండా హౌస్ అరెస్ట్ చేశారు. దానిలో భాగంగా మాజీ శాసనసభ్యులు, రుడా మాజీ చైర్మన్ రౌతు సూర్యప్రకాసరావుని కూడా ఇంటివద్ద నిర్బంధించారు. ఈ సందర్భంగా రౌతు మాట్లాడుతూ ఏ బి ఎన్ రాధాకృష్ణ మహిళలపై దారుణంగా మాట్లాడారని,ఒక పత్రికకు అధినేత స్థానంలో ఉండి అంత నీచంగా మాట్లాడం తగదని రాధాకృష్ణ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాధాకృష్ణ లాంటి వాళ్ళ వల్ల రాజకీయ విలువలు పోతున్నాయని రౌతు మండిపడ్డారు.తెలుగుదేశంకూటమి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్నా ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలు ఇవ్వకుండా ఇలా ప్రజలను తప్పుదోవ పట్టించడానికి డైవర్షన్ రాజకీయాలను తెలుగుదేశం పార్టీ వాళ్ళు చేస్తున్నారని ఆయన విమర్శించారు.రాధాకృష్ణను అరెస్ట్ చేసి విలువలు కాపాడాలని అన్నారు. కార్యక్రమంలో రౌతుతో పాటు మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ, నీలం గణపతి, అందనాపల్లి సత్యనారాయణ, వెంకన్న, టెంట్ హౌస్ హరి, రవిబాబు, కిట్టు,శంకర్, రమణ,రత్నం తదితరులు రౌతు నివాసం వద్ద ఉన్నారు.

# విద్యుత్‌ను ఆదా చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత

## సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగించుకోండి ఎస్సీఎస్టీలకు ఉచితంగా సోలార్ విద్యుత్ కనెక్షన్లు

**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** విద్యుత్‌ను ఆధార్ చేయడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండపేట 8వ వార్డులో ఎస్సీ,ఎస్టీ ఉచిత సోలార్ విద్యుత్ పథకాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం ఉచితంగా సూర్య ఘర్ పథకం అమలు చేస్తుందని పేర్కొన్నారు. 8వ వార్డులో లబ్ధిదారుడు కందుకూరు తొక్కయ్య ఇంటి వద్ద ఈ సూర్యఘర్ పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూకూటమి ప్రభుత్వం పేదల అభివృద్ధి, సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తోందన్నారు. విద్యుత్ భారం తగ్గించి ప్రతి పేద ఇంటికి ఆర్థిక ఉపశమనం కలిగించాలనే లక్ష్యంతో ఈ సూర్యఘర్ పథకంను ప్రారంభించామన్నారు. ఈ పథకం ద్వారా సౌరశక్తి వినియోగం పెరుగుతుంది చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. 2 కిలోవాట్ల సోలార్ ప్యానెల్స్ ఉచితంగా అమర్చడం 5 ఏళ్ల నిర్వహణ చేస్తారన్నారు.సొంత ఇల్లు కలిగి ఉండాలన్నారు. నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడకం ఉండాలన్నారు. అదే ఇతరులకు కేంద్ర, రాష్ట్ర



ప్రభుత్వాల సబ్సిడీతో కలిపి 3 కిలోవాట్ల వరకు రూ. 78,000 వరకు రాయితీ లభిస్తుందన్నారు. నిరంతర విద్యుత్, సున్నా విద్యుత్ బిల్లు, అదనపు విద్యుత్‌ను విక్రయించే అవకాశం ఉందన్నారు. పి ఎం సూర్య ఘర్ పోర్టల్ ద్వారా లేదా స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చనీ చెప్పారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు తమ ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకోవడానికి అంగీకారం తెలపాలన్నారు. మండపేట లో మండపేట లో సర్వే చేసిన ఎస్ సి, ఎస్ టి సర్వీసులు 7122 ఉన్నాయన్నారు. వీటిలో సోలార్ ఏర్పాటు కు అనుకూలంగా 3806 ఇళ్ళు ఉన్నాయని చెప్పారు.అనుగుణంగా లేనివి 3316 ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డ్ టిడిపి ప్రెసిడెంట్ పెందుర్తి కిషోర్, 8వ వార్డ్ టిడిపి ఇంచార్జ్ పెందుర్తి ప్రదీప్ కుమార్, టిడిపి ప్రధాన కార్యదర్శి పల్లి వెంకటరావు, 7వ వార్డ్ టిడిపి ఇంచార్జ్ చాపల వీరబాబు, ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర కార్యదర్శి ధూళి జయరాజు, మోరంపూడి సూరిబాబు, మాజీ కౌన్సిలర్ సవరపు సతీష్, జనసేన నాయకుడు పైడిమళ్ళ సతీష్, బి ఎల్ ఏ ముమ్మిడివరపు నారాయణరావు, బొమ్మ గంగాధర్, దూలి ప్రవీణ్, కందుకూరు గంగరాజు, మచ్చ రాంబాబు, గోసాల ప్రేమ్ కుమార్, సాధనాల చక్రపాణి, టౌన్ క్లస్టర్ టిడిపి ఇంచార్జ్ ఉంగరాల రాంబాబు, మండపేట టౌన్ టిడిపి ప్రెసిడెంట్ మాత్స నాగబాబు,పిట్ట రాజబాబు, మాజీ ఏ ఎం సి చైర్మన్ చేకూరి రమేష్ రాజు,పాలచర్ల శిరీష్, ధూళి అన్నవరం, రామచంద్రపురం డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీర మల్లిక, మండపేట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిహెచ్ శ్రీధర్ , అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ ఎం. ముని, జూనియర్ ఇంజనీర్ పి.వి. సత్యనారాయణ, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
సువర్ణావకాశం
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం



## ఆ హీరోయిన్ మద్యం తాగదు.. కానీ ఆమెకు ఉన్న అలవాటు ఇదే..

### అసలు విషయం బయటపెట్టిన సమంత

స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం తిరిగి సినిమాల్లో బిజీ అవుతుంది. సమంత ఇటీవలే నిర్మాతగా మారింది. రీసెంట్ గానే శుభం అనే సినిమాతో మంచి విజయాన్ని అందుకుంది. తెలుగు ఇండస్ట్రీలో ఒకానొక సమయంలో ఏలింది సమంత.. ఏ స్టార్ హీరో సినిమా చూసినా హీరోయిన్ గా సమంతానే ఉండేది. పెళ్లి తర్వాత సమంత సినిమాల స్పీడ్ తగ్గించింది. ఎప్పుడైతే మాయోసైటిస్ బారిన పడిందో అప్పటి నుంచి సమంత సినిమాలు తగ్గించేసింది. మయోసిటిస్ నుంచి పూర్తిగా కోలుకోవడానికి ఏడాది గ్యాప్ తీసుకుంది. ఏడాది పాటు సినిమాలకు దూరం ఉండి మానసిక ప్రశాంతతను పొంది.. ఇప్పుడు తిరిగి సినిమాల పై ఫోకస్ పెడుతుంది. అంతే కాదు ఇటీవలే నిర్మాత రాజ్ ను వివాహం చేసుకొని కొత్తజీవితాన్ని ప్రారంభించింది సామ్. ఒక వైపు హీరోయిన్ గా సినిమాలు లైనప్ చేస్తూనే ఇప్పుడు నిర్మాతగా మారి సినిమాలు చేస్తుంది సామ్. మొన్నామధ్య శుభం అనే సినిమా చేసి మంచి విజయాన్ని అందుకుంది. ప్రస్తుతం సమంత మా ఇంటి బంగారం అనే సినిమాలో నటిస్తుంది. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదిలా ఉంటే తాజాగా సమంత ఓ హీరోయిన్ గురించి చేసిన కామెంట్స్ వైరల్‌గా మారాయి. సమంత, కీర్తిసురేష్ మంచి ఫ్రెండ్స్.. ఈ ఇద్దరూ టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్స్ గా దూసుకుపోతున్నారు. ఎవరి సినిమాలతో వారు ఫుల్ బిజీగా గడిపేస్తున్నారు. తెలుగు కీర్తిసురేష్ వరుసగా సినిమాలు చేస్తూ రాణిస్తున్నారు. తెలుగుతో పాటు, తమిళ సినిమాల్లో నటిస్తూ ఆకట్టుకుంటుంది. అలాగే ఈ అమ్మడు మొన్నామధ్య హిందీలోనూ అడుగుపెట్టింది. కానీ హిందీలో చేసిన ఒకే ఒక్క సినిమా డిజాస్టర్ అయ్యింది. ఇదిలా ఉంటే తాజాగా సమంత కీర్తిసురేష్ గురించి ఆసక్తికర కామెంట్స్ చేసింది. రీసెంట్ గా కీర్తిసురేష్ కు మద్యం తాగే అలవాటు ఉందని ప్రచారం జరుగుతుంది. సోషల్ మీడియాలోనూ కీర్తి గురించి రకరకాల కామెంట్స్ వినిపిస్తున్నాయి. వీటి పై సమంత స్పందించింది. కీర్తిసురేష్ గు మద్యం తాగే అలవాటు లేదు.. కానీ ఆమెకు మరో అలవాటు ఉంది.. అదేంటంటే హైపర్ మ్యాక్ . ఎక్కువగా ఇతరులను నవ్వించే అలవాటు. అలాగే ఒక్కసారి మాట్లాడితే కంటిన్యూగా మాట్లాడుతూనే ఉంటారు. అలాగే కీర్తి అర్ధరాత్రి వరకు మాట్లాడుతూ నవ్విస్తూనే ఉంటుందని, రైమింగ్ తో మాట్లాడుతూ ఉంటుందని సమంత చెప్పుకొచ్చింది. ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్‌గా మారాయి.

## లక్ అంటే ఈవిడదే..!

### రెబల్ స్టార్ ప్రభాస్‌కు అక్కగా స్టార్ యాంకర్..!!



రెబల్ స్టార్ ప్రభాస్ లైనప్ చేసిన సినిమాలు చూస్తే మెంటలెక్కుతుంది. వరుసగా పాన్ ఇండియా సినిమాలో చేస్తూ దూసుకుపోతున్నాడు. ప్రభాస్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్‌తో సలార్ 2, కల్కి 2, సందీప్ రెడ్డి వంగతో కలిసి స్పిరిట్ అనే సినిమాలు చేస్తున్నాడు. వీటితోపాటు హనురాఘవపూడి దర్శకత్వంలో సినిమా చేస్తున్నాడు ప్రభాస్. పాన్ ఇండియా హీరో, రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. ఇటీవలే మారుతి దర్శకత్వంలో రాజా సాబ్ అనే సినిమాలో నటించాడు ప్రభాస్. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. అంతే కాదు ప్రభాస్ అభిమానులకు దారుణంగా నిరాశపరిచింది. ఈ సినిమా తర్వాత డార్లింగ్ ఇప్పుడు వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నాడు. సందీప్ రెడ్డి వంగ దర్శకత్వంలో స్పిరిట్ అనే సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా షూటింగ్ సైలెంట్ గా కనిచేస్తున్నాడు సందీప్. ఆ మధ్య స్పిరిట్ నుంచి విడుదల చేసిన ప్రభాస్ పోస్టర్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంది. ఈ సినిమాతో పాటు సలార్ 2, కల్కి 2, హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు ప్రభాస్. ఇదిలా ఉంటే ప్రభాస్ చాలా మంది హీరోయిన్స్ తో కలిసి నటించారు. అలాగే ఎంతో మంది నటీనటులతో కలిసి సినిమాలు చేశారు ప్రభాస్. కాగా ప్రభాస్ తో ఓ స్టార్ యాంకర్ కలిసి నటించిందని మీకు తెలుసా.? అది కూడా ప్రభాస్ కు అక్కగా నటించింది ఆ స్టార్ యాంకర్. ఆమె ఎవరో తెలుసా.? చాలా మంది ప్రభాస్ అభిమానులకు ఇప్పటికే అది తెలిసే ఉంటుంది. ఆమె మరెవరో కాదు బుల్లితెరపై తిరుగులేని యాంకర్ గా రాణిస్తున్న సుమ. అవును ప్రభాస్‌కు అక్కగా సుమ నటించారు. ప్రభాస్ నటించిన సినిమాల్లో సూపర్ హిట్ సినిమా వర్షం.. శోభన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమాలో త్రిషను హీరోయిన్ గా నటించింది. కాగా ఈ సినిమాలో ప్రభాస్ అక్కగా స్టార్ యాంకర్ సుమ కనకాల నటించారు. ఆ సినిమాలో ఆమె కనిపించేది కొంతసేపు అయినా తన నటనతో ఆకట్టుకున్నారు సుమ. యాంకర్ గా రాణిస్తున్న సుమ. గతంలో కొన్ని సినిమాల్లో కీలక పాత్రల్లో నటించారు. పలు ఇంటర్వ్యూల్లో సుమ ఈ విషయాన్ని పంచుకున్నారు.

### చివరి బంతికి హైడ్రామా..

# ఉత్కంఠ మ్యాచ్‌లో గుజరాత్ విజయం

జీటీ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 45 బంతుల్లో 70 పరుగులు, జోస్ బట్లర్ 27 బంతుల్లో 52 పరుగులు, వాషింగ్టన్ సుందర్ 32 బంతుల్లో 55 పరుగులు సాధించారు. ఢిల్లీ తరఫున.. ఐపీఎల్ 19లో గుజరాత్ టైటాన్స్ తమ తొలి విజయాన్ని నమోదు చేసుకుంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఒక పరుగు తేడాతో ఓడించి, ఈ సీజన్‌లో వారికి తొలి ఓటమిని అందించింది. అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. దీనికి సమాధానంగా, ఢిల్లీ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 209 పరుగులు మాత్రమే చేయగలిగింది. రషీద్ ఖాన్ మూడు వికెట్లు పడగొట్టాడు. మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ చెరో వికెట్ తీసుకున్నారు. ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున కేఎల్ రాహుల్ 92 పరుగులు చేసినా, జట్టును విజయపథంలో నడిపించలేకపోయాడు. జీటీ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 45 బంతుల్లో 70 పరుగులు, జోస్ బట్లర్ 27 బంతుల్లో 52 పరుగులు, వాషింగ్టన్ సుందర్ 32 బంతుల్లో 55 పరుగులు సాధించారు. ఢిల్లీ తరఫున ముఖేష్ కుమార్ రెండు వికెట్లు పడగొట్టాడు. లుంగి ఎంగిడి, కుల్దీప్ యాదవ్ చెరో వికెట్ తీసుకున్నారు.



### హాఫ్ సెంచరీలతో చెలరేగిన గిల్, బట్లర్, సుందర్..

# ఢిల్లీ ముందు భారీ టార్గెట్



ఐపీఎల్ 2026 యొక్క 14వ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్‌కు 211 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో ఢిల్లీ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్, 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. ఐపీఎల్ 2026లో భాగంగా 14వ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్‌కు 211 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో ఢిల్లీ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్, 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 45 బంతుల్లో 70 పరుగులు, జోస్ బట్లర్ 27 బంతుల్లో 52 పరుగులు, వాషింగ్టన్ సుందర్ 32 బంతుల్లో 55 పరుగులు సాధించారు. ఢిల్లీ తరఫున ముఖేష్ కుమార్, లుంగి ఎంగిడి, కుల్దీప్ యాదవ్, ముఖేష్ కుమార్ తలా ఒక వికెట్ తీసుకున్నారు.

**రెండు జట్ల ప్లేయింగ్ 11..**

ఢిల్లీ క్యాపిటల్స్: కేఎల్ రాహుల్ (కీపర్), పాతుమ్ నిస్సాంక, నితీష్ రాణా, డేవిడ్ మిల్లర్, ట్రిస్టన్ స్టబ్స్, అక్షర్ పటేల్ (కెప్టెన్), విపరాజ్ నిగమ్, కుల్దీప్ యాదవ్, లుంగి ఎన్గిడి, ముఖేష్ కుమార్, టి నటరాజన్.

**ఇంపాక్ట్ ప్లేయర్లు:** సమీర్ రిజ్వీ, అశుతోష్ శర్మ, నబీ, నమీరా, నాయర్.

**గుజరాత్ టైటాన్స్:** సాయి సుదర్శన్, శుభమన్ గిల్ (కెప్టెన్), జోస్ బట్లర్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, గ్లెన్ ఫిలిప్స్, షారుక్ ఖాన్, రాహుల్ తెవాటియా, రషీద్ ఖాన్, కగిసో రబడ, అశోక్ శర్మ, మహ్మద్ సిరాజ్.

**ఇంపాక్ట్ ప్లేయర్లు:** ప్రసిద్ధ్ కృష్ణ, జాసన్ హోల్డర్, మానవ్ సుతార్, జయంత్ యాదవ్, అనుజ్ రావత్.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com